# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 18 సంచిక: 346 | బుధవారం, 13 ఆగస్ట్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



MHR TV

www.MHRtv.com




## అమిత్ షాను పొగిడారని
# రగడ

కేరళలో చర్చి, సీపీఎం మధ్య మాటల యుద్ధం!

ఛత్తీస్‌గఢ్‌లో నన్‌ల విడుదలకు సాయపడిన అమిత్ షా

కేంద్ర మంత్రిని ప్రశంసించిన తలస్సరీ ఆర్చ్‌బిషప్

ఆర్చ్‌బిషప్‌ను అవకాశవాదిగా పేర్కొన్న సీపీఎం కార్యదర్శి

సీపీఎం వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన క్యాథలిక్ చర్చి

పాలక పార్టీ, చర్చి మధ్య ముదిరిన మాటల యుద్ధం


**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ప్రశంసించినందుకు కేరళలో అధికార సీపీఎం, క్యాథలిక్ చర్చి మధ్య తీవ్ర వివాదం చెలరేగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్ని రేపగా, చర్చి వర్గాలు తీవ్రంగా స్పందించి ఎదురుదాడికి దిగాయి. ఈ పరిణామంతో కేరళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

**అసలేం జరిగింది?**

ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో తప్పుడు ఆరోపణలతో ఇద్దరు క్రిస్టియన్ నన్‌లను అరెస్ట్ చేశారు. ఈ విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోక్యం చేసుకుని వారి విడుదలకు సహకరించారు. దీనిపై తలస్సరీ ఆర్చ్‌బిషప్ మార్ జోసెఫ్ పంప్లానీ, అమిత్ షాకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రశంసించారు. అయితే, ఆర్చ్‌బిషప్ తీరుపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

మిగతా 2లో..



## బంగారంపై సుంకాలు ఉండవు

కొన్ని రోజులుగా మార్కెట్‌లో కొనసాగుతున్న గందరగోళానికి తెర

స్విస్ గోల్డ్ బార్స్‌పై సుంకాలంటూ వచ్చిన వార్తలతో మొదలైన అనిశ్చితి

చైనా ఉత్పత్తులపై టారిఫ్‌ల గడువును మరో 90 రోజులు పొడిగిస్తూ ఉత్తర్వులు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్

02



## ఖజానాలో దోపిడీ దొంగల బీభత్సం

చందానగర్‌లో సిబ్బందిపై కాల్పుల కలకలం

ఖజానా జ్యువెలర్స్ షాప్‌లో దోపిడీకి యత్నం

దుండగుల కోసం గాలిస్తున్న పోలీసులు

02

# గులాబీ దళపతి మౌనమేలనోయి



గతంలో బలమైన శక్తిగా ఎదిగిన బీఆర్ఎస్

ఇప్పుడు పతనం దిశగా పయనం

గులాబీ బాస్ కేసీఆర్ వారసుల చెరోదారి

నాయకత్వ సంక్షోభం, వ్యక్తిగత విమర్శలు

సోషల్ మీడియా వ్యూహంతో కొట్టుమిట్టాడుతున్న పార్టీ

**హైదరాబాద్, ఆగస్టు 12, (ప్రజాస్వరం) :**

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్. మొదటి లక్ష్యం సాధించింది. స్వరాష్ట్రం సిద్ధించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు.. రాష్టం సాధించిన పార్టీగా 2014లో గులాబీ పార్టీకే పట్టం కట్టారు. మరోసారి 2018లో కూడా అవకాశం ఇచ్చారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఎదిగింది. కానీ ఇప్పుడు పతనం దిశగా పయనిస్తోంది. గులాబీ బాస్ కేసీఆర్ వారసుల చెరోదారి.. నాయకత్వ సంక్షోభం, వ్యక్తిగత విమర్శలతో కూడిన సోషల్ మీడియా వ్యూహంతో కొట్టుమిట్టాడుతోంది. గువ్వల బాలరాజు వంటి నాయకుల వలసలు, పార్టీ సోషల్ మీడియా విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటాల లేమి వంటి అంశాలు బీఆర్ఎస్ దిగజారుడుకు కారణాలుగా కనిపిస్తున్నాయి.బీఆర్ఎస్ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన గువ్వల బాలరాజు వ్యవహారం పార్టీలోని అంతర్గత సమస్యలను స్పష్టంగా తెలియజేస్తోంది. బాలరాజు తన

మిగతా 2లో..





## మీరు డాగ్ లవరా..? అయితే మీకు గుడ్‌న్యూస్!

కుక్కల దాడులపై ప్రజల ఆందోళన

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక దత్తత డ్రైవ్

దత్తతకు ఉచితంగా అందుతున్న ఆరోగ్యకరమైన కుక్కపిల్లలు

దత్తత ద్వారా వీధి కుక్కల సంఖ్య తగ్గించేందుకు చర్యలు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఈ మధ్య కాలంలో కుక్కల దాడి ఘటనలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. చాలామంది చిన్నారులు కుక్కల దాడుల్లో ప్రాణాలు కోల్పోవడంతో ప్రజలలో ఆందోళన పెరిగింది. దీంతో వీధుల్లోని కుక్కలను

మిగతా 2లో..



## బండి సంజయ్‌కి లీగల్ నోటీస్

అసత్యాలు మాట్లాడారంటూ కేంద్రమంత్రికి లీగల్ నోటీసు పంపిన కేటీఆర్

రాజకీయ ఉనికి కోసమే కేటీఆర్‌పై అసత్యపూరిత వ్యాఖ్యలు

వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

కేంద్రమంత్రి బండి సంజయ్‌కి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీసు పంపారు. ఫోన్ టాపింగ్ కేసులో బండి సంజయ్ అడ్డగోలుగా, అసత్యపూరితంగా చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ లీగల్ నోటీస్ పంపారు. కేంద్రమంత్రిగా ఉండి బాధ్యతారహితంగా మాట్లాడారని

మిగతా 2లో..





## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

అతి త్వరగా ఇళ్లకు చేరుకోండి!

అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు

అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచన

ఇంటి నుంచే పని చేసేలా ప్లాన్ చేసుకోవాలి

02

# బీజేపీలో చేరుతున్నారా?


కొన్ని మాటలు యాది పెట్టుకోండి, మరికొన్ని రాసి పెట్టుకోండి!

బీజేపీలో చేరుతున్న వారికి రాజా సింగ్ హెచ్చరికలు

పార్టీలో చేరే ముందు కొన్ని మాటలు యాది పెట్టుకోండి

బీజేపీలో చేరేముందు కొంతమందితో చర్చలు చేసుకొని రండి

బాధలు భరించే శక్తి మీలో పెంచుకోవాలి



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీజేపీలో చేరుతున్న వారికి గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ హెచ్చరికలు జారీ చేశారు. బీజేపీ పార్టీలో చేరుతున్న వారికి స్వాగతంసుస్వాగతం.. పార్టీలో చేరే ముందు కొన్ని మాటలు యాది పెట్టుకోండి, మరికొన్ని రాసి కూడా పెట్టుకోండి అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పార్టీలో చేరిన తర్వాత మీరు కోరుకున్నది మీ అసెంబ్లీ, మీ జిల్లా, మీ పార్లమెంటరీ నియోజకవర్గంలో

మిగతా 2లో..

# మేమిద్దరం అన్నదమ్ములమని అప్పుడు తెలియదా?

మరోసారి రాజగోపాల్ రెడ్డి హాట్ కామెంట్స్

ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి?

ఆలస్యమైనా సరే నేను ఓపిక పడుతా

రెండవసారి ప్రామిస్ చేసినప్పుడు తెలియదా?



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వకుండా ఎవరు అడ్డుకుంటున్నారు? అని ప్రశ్నించారు. తనను పార్టీలోకి తీసుకున్నప్పుడు మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని కాంగ్రెస్ హైకమాండ్‌కు తెలియదా? అనిమండిపడ్డారు. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే అని, ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? అని అడిగారు. ఆలస్యమైనా సరే తాను ఓపిక పడుతా అని, తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే అని రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. 'నాకు మంత్రి పదవి ఇవ్వకుండా ఎవరడ్డుకుంటున్నారు. నన్ను పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండవసారి ప్రామిస్ చేసినప్పుడు తెలియదా మేమిద్దరం అన్నదమ్ములం ఉన్నామని. ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య, ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా ఉంది. 9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండడం తప్పా. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే, ఇద్దరం గట్టి వాళ్లమే. మా ఇద్దరికీ మంత్రి పదవులు

మిగతా 2లో..



## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హౌస్ అరెస్ట్!

పెద్దమ్మ టెంపుల్‌కి వెళ్తారనే సమాచారంతో గృహ నిర్బంధం

గోషామహల్ నియోజకవర్గంలో తిరంగా యాత్ర

02

# బంగారంపై సుంకాలు ఉండవు

- కొన్ని రోజులుగా మార్కెట్‌లో కొనసాగుతున్న గందరగోళానికి తెర
- స్విస్ గోల్డ్ బార్స్‌పై సుంకాలంటూ వచ్చిన వార్తలతో మొదలైన అనిశ్చితి
- చైనా ఉత్పత్తులపై టారిఫ్‌ల గడువును మరో 90 రోజులు పొడిగిస్తూ ఉత్తర్వులు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**



అంతర్జాతీయ మార్కెట్లను కొన్ని రోజులుగా కలవరపెడుతున్న ఊహాగానాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరదించారు. బంగారం దిగుమతులపై తమ ప్రభుత్వం ఎలాంటి సుంకాలు (టారిఫ్‌లు) విధించడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' లో ఒకే ఒక్క వాక్యంతో "బంగారంపై సుంకాలు ఉండవు!" అని పోస్ట్ చేశారు. దీంతో పసిడి వాణిజ్యంపై నెలకొన్న గందరగోళానికి తెరపడినట్లయింది.ఇటీవల స్విట్జర్లాండ్ నుంచి దిగుమతి అయ్యే 1 కిలోగ్రాము, 100 ఔన్సుల గోల్డ్ బార్స్‌పై అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం సుంకాలు విధించవచ్చని ఒక వార్త హల్‌చల్ చేసింది. ఈ వార్తలతో బంగారంపై దేశాలవారీగా సుంకాలు విధిస్తారేమోనన్న ఆందోళనలు మొదలయ్యాయి. ఈ రకం గోల్డ్ బార్స్‌ను కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఫ్యూచర్స్ కాంట్రాక్టుల కోసం, అలాగే ఆభరణాల తయారీ, పారిశ్రామిక అవసరాల కోసం ఎక్కువగా వినియోగిస్తారు. సుంకాలు విధిస్తే అంతర్జాతీయంగా బంగారం సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతుందని స్విస్ తయారీదారుల సంఘం కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా ప్రకటనతో మార్కెట్ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి.

**చైనా టారిఫ్‌ల గడువు పొడిగింపు**

బంగారంపై స్పష్టతనిచ్చిన సమయంలోనే, చైనాతో వాణిజ్య వివాదం విషయంలో ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌ల గడువును మరో 90 రోజులు పొడిగిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. వాస్తవానికి ఈ గడువు ఆగస్టు 12వ తేదీ అర్ధరాత్రితో ముగియాల్సి ఉంది. అమెరికా సోయాబీన్స్ కొనుగోళ్లను నాలుగు రెట్లు పెంచాలని చైనాను కోరిన మరుసటి రోజే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.



# అమిత్ షాను పొగిడారని రగడ

**మొదటిపేజీ తరువాయి**

ఎం.వి. గోవిందన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నన్‌ల అరెస్ట్ సమయంలో బీజేపీని విమర్శించి, బెయిల్ వచ్చిన తర్వాత అమిత్ షాను పొగడటం ఆర్చ్‌బిషప్ అవకాశవాదానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు.

**తీవ్రంగా స్పందించిన చర్చి వర్గాలు**


గోవిందన్ వ్యాఖ్యలపై కేరళ క్యాథలిక్ కాంగ్రెస్, తలస్సరీ ఆర్చిడయాసిస్ తీవ్రంగా మండిపడ్డాయి. గోవిందన్ వ్యాఖ్యలు ఆయన హోదాకు తగనివని, అవివేకంతో కూడుకున్నవని కేరళ క్యాథలిక్ కాంగ్రెస్ ప్రతినిధి ఫాదర్ ఫిలిప్ కవియిల్ విమర్శించారు. "గోవిందన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటారో లేదో ఆయన ఇష్టం. కానీ, పినరయి విజయన్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావాలా వద్దా అనే విషయం కూడా ఆయన ఆలోచించుకోవాలి" అంటూ తీవ్ర హెచ్చరిక చేశారు. తలస్సరీ ఆర్చిడయాసిస్ కూడా ఘాటుగా స్పందించింది. బిషప్‌లు సీపీఎం పార్టీ ప్రధాన కార్యాలయం ఏకేజీ సెంటర్ ఆదేశాల ప్రకారం నడుచుకోవాలా అని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పడం తమ బాధ్యత అని స్పష్టం చేసింది. 'అవకాశవాది' అనే పదం గోవిందన్‌కే సరిగ్గా సరిపోతుందని, ఆయన వ్యక్తిగత బలహీనతలను ఇతరులకు ఆపాదించవద్దని హితవు పలికింది. గోవిందన్ వ్యాఖ్యలు ఆయన ప్రతిష్ఠకే కాకుండా, పార్టీకి, ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు కూడా రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయని హెచ్చరించింది.



# మేమిద్దరం అన్నదమ్ములమని అప్పుడు తెలియదా?

**మొదటిపేజీ తరువాయి**

ఇస్తే తప్పేంటి?. ఆలస్యమైనా సరే నేను ఓపిక పడుతున్నా. భువనగిరి పార్లమెంటు నుంచి ఎంపీగా పని చేశాను, నల్గొండ జిల్లాకు ఎమ్మెల్సీగా పని చేశాను. నల్గొండ జిల్లాలో ఉన్న నియోజకవర్గాలలో మునుగోడు నియోజకవర్గం వెనుకబడి ఉంది' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పారు.



# బీజేపీలో చేరుతున్నారా?


**మొదటిపేజీ తరువాయి**

జరగదు అని చెప్పారు. మీపైన విశ్వాసం పెట్టుకొని మీ కార్యకర్తలు బీజేపీలో చేరిన తర్వాత మీరు వారికి ఏ పదవి కూడా ఇప్పించలేరని పేర్కొన్నారు. బీజేపీలో చేరేముందు కొంతమందితో చర్చలు చేసుకొని రండి అని రాజా సింగ్ సూచనలు చేశారు. ఇటీవల రాజా సింగ్ బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ వెయ్యనివ్వలేని కారణంగానే రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. 'బీజేపీలో వేరే పార్టీ నుంచి చాలామంది చేరుతున్నారు. బీజేపీ పార్టీలో చేరుతున్న వారికి స్వాగతంసుస్వాగతం. బీజేపీలో చేరే ముందు కొన్ని మాటలు యాది పెట్టుకోండి, రాసి కూడా పెట్టుకోండి. బీజేపీలో చేరిన తర్వాత మీరు కోరుకున్నది మీ అసెంబ్లీలో, మీ జిల్లాలో, మీ పార్లమెంటరీ నియోజకవర్గంలో జరగదు. మీపైన విశ్వాసం పెట్టుకొని మీ కార్యకర్తలు బీజేపీలో చేరిన తర్వాత వారికి ఏ పదవి కూడా ఇప్పించలేరు. ఎన్నికల ముందు మీకే టికెట్ వస్తదని గ్యారెంటీ కూడా ఉండదు. బీజేపీలో ఈ రోజు మీరు చేరుంటారు కదా. మొదట్లో ఫస్ట్ సీట్లో మీరు ఉంటారు కానీ తర్వాత లాస్ట్ సీట్లో ఉంటారు. బీజేపీలో చేరిన తర్వాత కొన్ని అలవాట్లు మీరు చేసుకోవాలి. కొన్ని బాధలు కూడా భరించే శక్తి కూడా మీలో పెంచుకోవాలి' అని ఎమ్మెల్యే రాజా సింగ్ అన్నారు. 'మా అసెంబ్లీలో 11 సంవత్సరాలుగా వారి అణచివేతను ఎదుర్కొంటున్నాము. మా జిల్లా, డివిజన్, నియోజకవర్గంలో వాళ్ల వ్యక్తి ఉంటాడు. మేము కోరుకున్నా మమ్మల్ని మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన మా కార్యకర్తల కోసం ఏమీ చేయలేకపోయాము. గోషామహల్ అసెంబ్లీ నుంచి బీజేపీలో చేరేముందు కొంత మందితో మీరు మాట్లాడి.. చేరిన తర్వాత ఏమైతదని కనుక్కోండి. విజయశాంతి, జితేందర్ రెడ్డి, నాగం జనార్ధన్ రెడ్డి.. చాలా మంది వేరే పార్టీ నుంచి బీజేపీలో చేరిన తర్వాత ఎందుకు వెళ్లిపోయారో కనుక్కోండి. నా పర్సనల్ విజ్ఞప్తి ఏంటంటే?.. అలాంటి వారితో ఒక్కసారి మాట్లాడండి. హిందుత్వానికి, దేశానికి, సమాజానికి చాలా మంచి పనులు చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ. కానీ తెలంగాణలో బీజేపీ పార్టీ కొందరి వల్ల సర్వనాశనం అవుతోంది. బీజేపీలో మేము ఏది చెప్తే అదే అయితది, మేము ఏది రాసితే అదే రాజ్యమైతది అనుకునే వ్యక్తుల వల్లనే పార్టీ సర్వనాశనం అవుతుంది. ఈరోజు కాకపోతే రేపు తెలంగాణలో రాక్షసులు నాశనమవుతారు. కార్యకర్తల ఆశీస్సులతో బీజేపీ తెలంగాణను పాలిస్తుంది. తెలంగాణలో సీఎం బీజేపీ నుంచే వస్తారు' అని ఎమ్మెల్యే రాజా సింగ్ చెప్పుకొచ్చారు.

# హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

- అతి త్వరగా ఇళ్లకు చేరుకోండి!
- అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు
- అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచన
- ఇంటి నుంచే పని చేసేలా ప్లాన్ చేసుకోవాలి

**హైదరాబాద్, ప్రజాస్వరం :**



అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో గత 56 రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. భారీగా వానలతో దాదాపుగా అన్ని జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వరదలకు చెరువులు, జలాశయాలు నిండిపోయాయి. మరోవైపు రహదారులపై వరద చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారీ వర్షాలకు హైదరాబాద్ నగర వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయింది. ప్రయాణికులు గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో భారీ వర్షం పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ వర్ష సూచన నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. నగర వాసులకు ఓ సూచన చేశారు. అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచించారు. మధ్యాహ్నం 3 గంటల్లోగా ఇళ్లకు చేరుకునేలా ప్లాన్ చూసుకోవాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీని నివారించడానికి సాయంత్రం షిఫ్ట్ ఉన్నవారు ఇంటి నుంచే పని చేసేలా ప్లాన్ చేసుకోవాలని ఓ ప్రకటన రిలీజ్ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ పరిధిలో కొన్ని చోట్ల ఆకాశం మేఘావృతమై ఉంది. మరికొన్ని చోట్ల వర్షం పడుతోంది. సాయంత్రం లేదా రాత్రి సమయంలో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో 3 నుంచి 6 సెంమీల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఆగస్టు 12 నుంచి 16 వరకు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హౌస్ అరెస్ట్!

- పెద్దమ్మ టెంపుల్‌కి వెళ్తారనే సమాచారంతో గృహ నిర్బంధం
- గోషామహల్ నియోజకవర్గంలో తిరంగా యాత్ర

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. నేడు బంజారాహిల్స్ పెద్దమ్మ టెంపుల్‌కి వెళ్తారనే సమాచారంతో రామచందర్ రావును ముందస్తుగా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కొన్ని రోజుల క్రితం ఓ దుండగుడు పెద్దమ్మ ఆలయాన్ని ధ్వంసం చేయడంతో వివాదం నెలకొంది. నేడు పెద్దమ్మ టెంపుల్‌లో బీజేపీ నేతలు కుంకుమార్చన చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను ముందస్తుగా హౌస్ అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రామచందర్ రావు ఇంటివద్ద భారీగా పోలీసులు మోహరించి ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం.. నేడు లాలాపేటలో, గోషామహల్ నియోజకవర్గంలో తిరంగా యాత్రలో ఆయన పాల్గొనాల్సి ఉంది. రామచందర్ రావు హౌస్ అరెస్టుపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి స్పందించారు. 'బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు ఇంటిని పోలీస్ యంత్రాంగం అకారణంగా దిగ్బంధనం చేసింది. గృహనిర్బంధనం చేస్తున్న కారణం సరైనది కాదు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ప్రతిపక్ష పార్టీల నాయకులను నిర్బంధించడం మానుకోవాలి. నిర్బంధాలతో కార్యక్రమాలను అడ్డుకోవాలని చూడడం దురదృష్టకరం. గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం కూడా గృహనిర్మాంధాలు, ముందస్తు అరెస్టులు చేయడం పరిపాటిగా మారింది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు తావులేదు. రాంచందర్ రావు ఇంటి నుంచి వెంటనే పోలీసులు వెళ్లిపోవాలి. ఇదే విధంగా కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను బీజేపీ చేపడుతుంది. దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ హార్ ఘర్ తిరంగా యాత్రలను చేపట్టింది. ఈ తిరంగా యాత్రలో రాష్ట్ర అధ్యక్షులు సికింద్రాబాద్, గోషామాల్ నియోజకవర్గంలో పాల్గొనవలసింది ఉంది' అని మనోహర్ రెడ్డి అన్నారు.



# బండి సంజయ్‌కి లీగల్ నోటీస్

**మొదటిపేజీ తరువాయి**

కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ప్రజాప్రతినిధి మరొక ప్రజా ప్రతినిధిపై అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గం అంటూ నోటీసులలో పేర్కొన్నారు. కేవలం రాజకీయ ఉనికి కోసమే కేటీఆర్ పైన అసత్యపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని న్యాయవాదులు నోటీసులో పేర్కొన్నారు. తమ క్లైంట్‌కి వెంటనే క్షమాపణ చెప్పాలని బండి సంజయ్‌కి పంపిన లీగల్ నోటిలో న్యాయవాదులు తెలిపారు. భవిష్యత్తులో అడ్డగోలు, అసత్య ఆరోపణలు చేయకుండా ఉండాలని సూచించారు. లేదంటే తదుపరి లీగల్ నోటిస్‌తో పాటు చట్టంలో అందుబాటులో ఉన్న క్రిమినల్ చర్యలకు కూడా బండి సంజయ్ బాధ్యుడు అవుతారని హెచ్చరికలు జారీ చేశారు. బండి సంజయ్ ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల్లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. నోటీసులపై ఆయన ఎలా స్పందిస్తారో చూడాలి.

# మీరు డాగ్ లవరా..? అయితే మీకు గుడ్‌న్యూస్!

**మొదటిపేజీ తరువాయి**



తగ్గించాలన్న డిమాండ్లు కూడా బలపడుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వీధుల్లో కుక్కల సంఖ్యను తగ్గించేందుకు జీహెచ్ఎంసీ వినూత్నమైన దత్తత డ్రైవ్‌ను నిర్వహిస్తోంది. "బీ ఏ హీరో, అడాప్ట్ డోంట్ షాప్" అనే నినాదంతో ఈ నెల 17న బంజారాహిల్స్‌లోని జలగం వెంగళరావు పార్కులో ఉదయం 6 నుండి 10 గంటల వరకు ఈ దత్తత డ్రైవ్ నిర్వహించబడనుంది. ఈ డ్రైవ్‌లో భాగంగా ఉన్న కుక్కపిల్లలకు ఇప్పటికే డివార్మింగ్, టీకాలు చేయబడ్డాయి. ఇవి పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నాయని, స్నేహపూర్వక స్వభావం కలిగివుండటం విశేషం. ఈ కుక్కలను దత్తత తీసుకోవడానికి ఎలాంటి ఫీజులు ఉండవని, కావలసిన వారు ఉచితంగా దత్తత తీసుకోవచ్చని అధికారులు తెలియజేశారు. జీహెచ్ఎంసీ లక్ష్యం నగరంలోని వీధి కుక్కల సంఖ్యను తగ్గించడంతో పాటు, వారికి మానవీయ ప్రేమను పంచి మంచి వాతావరణాన్ని సృష్టించడం. ఈ దత్తత డ్రైవ్‌లో దత్తతకు తీసుకునే కుక్కలకు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, టీకాలు పూర్తి చేసిన తర్వాత మాత్రమే వాటిని అప్పగిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా పెంపుడు జంతువులను కొనడం కాకుండా, దత్తత ద్వారా అవి కొత్త ఇంట్లో మంచి సంరక్షణ పొందాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి తమ మద్దతు ఇవ్వాలని కోరుతోంది. ఈ డ్రైవ్ గురించి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోషల్ మీడియాలో వివరించినప్పుడు జంతు ప్రేమికుల నుండి మంచి స్పందన వచ్చింది. జీహెచ్ఎంసీ ప్రకారం, ఈ దత్తత కార్యక్రమం వీధి కుక్కలకు కొత్త జీవితాన్ని మాత్రమే అందించదు, వాటిని దత్తత తీసుకునే కుటుంబాలకు కూడా మంచి స్నేహితులను అందిస్తుంది.

# గులాబీ దళపతి మౌనమేలనోయి

**మొదటిపేజీ తరువాయి**

రాజీనామా లేఖలో బీఆర్ఎస్ నాయకత్వాన్ని గౌరవిస్తూనే, తన రాజకీయ భవిష్యత్ కోసం బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు. అయితే, బీఆర్ఎస్ సోషల్ మీడియా బృందం ఆయనను, ఆయన భార్యను వ్యక్తిగతంగా విమర్శిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా పార్టీ ఇమేజ్‌ను మరింత దిగజార్చింది. రాజకీయ నాయకులు ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి వెళ్లడం సర్వసాధారణం. అయితే, వలసపోయే నాయకులపై వ్యక్తిగత దాడులు చేయడం, బూతులతో కూడిన సోషల్ మీడియా పోస్ట్‌లు చేయడం వంటివి గులాబీ పార్టీకి రాజకీయంగా నష్టం కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నడిచే సోషల్ మీడియా పోస్టులు ఆయనకు తెలియకుండా వస్తున్నవి కావన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి విమర్శలు ప్రజల్లో పార్టీపై చిరాకు, అసహ్యం కలిగించే అవకాశం ఉంది. బాలరాజు స్పందన కూడా ఈ విమర్శలకు బదులుగా తీవ్రంగా ఉండటం, బీఆర్ఎస్ వ్యూహం రివర్స్ అవుతున్నట్లు సూచిస్తోంది.బీఆర్ఎస్ సోషల్ మీడియా వ్యూహాలను ఏపీలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విధానాలతో పోలుస్తున్నారు. వ్యతిరేకులపై అనుచిత వ్యాఖ్యలు, బూతులతో కూడిన ట్వీట్‌లు, తప్పుడు ప్రచారం చేయడం వంటివి బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన లక్షణాలుగా మారాయి. ఈ విధానం ఓటర్లను ఆకర్షించడంలో విఫలమవడమే కాక, పార్టీకి ఉన్న మద్దతుదారులను కూడా అసంతృప్తికి కారణమవుతోంది. సోషల్ మీడియాను రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవచ్చు, కానీ అది సానుకూలంగా, ఆకర్షణీయంగా ఉండాలి. బీఆర్ఎస్ విషయంలో, సోషల్ మీడియా బృందం ప్రతికూల వ్యాఖ్యలపై దృష్టి సారించడం వల్ల పార్టీ ఇమేజ్ దెబ్బతింటోంది.ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై గ్రౌండ్ లెవల్‌లో ఎలాంటి పోరాటం చేయలేదు. పార్టీ నిర్వహించే కార్యక్రమాలు ఎక్కువగా రాజకీయ లక్ష్యాలతో లేదా కేసీఆర్ సమస్యల చుట్టూ తిరుగుతున్నాయి. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలు ఉపాధి, విద్య, ఆరోగ్యం, లేదా రైతు సమస్యలపై బీఆర్ఎస్ ఎలాంటి ఉద్యమం చేపట్టలేదు. కేవలం రాజకీయ లాభాల కోసం కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పార్టీ ప్రజల నుంచి దూరమవుతోంది. ఒక బలమైన ప్రతిపక్షంగా, ప్రజల సమస్యలను గుర్తించి, వాటి కోసం గళమెత్తి, ఉద్యమాలు నడిపితేనే ప్రజల విశ్వాసం సంపాదించగలదు.బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టమైన దిశానిర్దేశం లేకుండా కొట్టుమిట్టాడుతోంది. పార్టీ నుంచి నాయకులు వలసపోవడం, సోషల్ మీడియాలో అనుచిత వ్యవహారం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా వ్యక్తిగత దూషణలకు దిగడం, దిగజారుడు మాటలు మాట్లాడడం, ఇక కవిత సొంత పార్టీకి దూరం కావడం, గులాబీ నేతలపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పార్టీ నాయకత్వం ఒకప్పుడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచినప్పటికీ, ప్రస్తుతం పార్టీలో కొత్త నాయకత్వం, కొత్త వ్యూహాలు అవసరమైన సమయంలో పాత విధానాలతోనే ముందుకెళ్లడానికి ప్రయత్నిస్తోంది.



# ఖజానా' దోపిడీ దొంగల బీభత్సం

- చందానగర్‌లో సిబ్బందిపై కాల్పుల కలకలం
- ఖజానా జ్యువెలర్స్ షాప్‌లో దోపిడీకి యత్నం
- దుండగుల కోసం గాలిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

హైదరాబాద్ నగరంలోని చందానగర్‌లో కాల్పుల కలకలం రేగింది. ప్రముఖ నగల దుకాణం 'ఖజానా జ్యువెలర్స్'లో దుండగులు దోపిడీకి ప్రయత్నించారు. దొంగతనంను అడ్డుకున్న సిబ్బందిపై దాడి చేయడమే కాకుండా.. కాల్పులు కూడా జరిపారు. దుండగుల కాల్పుల్లో షాపులోని పలువురు సిబ్బందికి గాయాలు అయ్యాయి. పోలీసుల రంగప్రవేశంతో దుండగులు షాప్‌లో నుంచి తప్పించుకుపోయారు. కేసు నమోదు చేసిన చందానగర్ పోలీసులు.. దుండగుల కోసం గాలిస్తున్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దుండగులు ముందుగా ఖజానా జ్యువెలర్స్ గేట్ సిబ్బందిని గాయపరిచి లోపలికి ఎంటర్ అయ్యారు. ఎదురుతిరిగిన సిబ్బందిపై తుపాకీతో కాల్పులు జరిపారు. మరికొందరిపై దాడులకు సైతం పాల్పడ్డారు. లాకర్ కీ ఇవ్వకపోవడంతో గన్ తీసుకొని బెదిరించారు. దుండగుల ముఠా అసిస్టెంట్ మేనేజర్‌పై కాల్పులు జరిపింది. షాప్ లోపల బంగారు ఆభరణాలకు సంబంధించిన స్టాల్స్ పగలగొట్టారు. స్టాఫ్ సిబ్బంది ఒకరు పోలీసులకు కాల్ చేయగా.. వెంటనే వారు ఖజానా జ్యువెలర్స్ షాప్‌కు చేరుకున్నారు. పోలీసులను చూసి దొంగల ముఠా పారిపోయింది. దుండగులు రెండు రౌండ్ల ఫైరింగ్ జరిపారు. తుపాకీతో సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. గ్యాంగ్‌లో మొత్తం 6 మంది సభ్యులు ఉన్నట్లు సమాచారం. దుండగుల కోసం 10 ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో చందానగర్‌లో ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపడ్డారు.



# అనుమానితులు సంచరిస్తే సమాచారం ఇవ్వండి

## మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్

**మెదక్, ఆగస్టు 12, (ప్రజా స్వరం) :**
ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా కార్డెన్ అండ్ సెర్చ్ మంగళవారం మెదక్ పట్టణం పిల్లికోటల్ లోని డబల్ బెడ్ రూమ్ ఇళ్లలో తెల్లవారు జామున మెదక్ డీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇద్దరు సీఐలు 8 ఎస్ఐ లు 97 సిబ్బందితో మొత్తం కలిపి 108 మంది పోలీస్ సిబ్బందితో దాదాపు 500 డబల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో సోదాలు చేశారు. సరియైన పత్రాలు లేని 134 ద్వి చక్ర వాహనాలు, 13 త్రీ చక్ర వాహనాలు, 2 కార్స్, 1 ట్రాలీ వెహికల్ ను అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా కమ్యూనిటి కాంటాక్టు లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగా డబల్ బెడ్ రూమ్ ఇళ్లలో కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కాలనీల్లో, ఇంటి ప్రదేశాల్లో అనుమానితులు ఎవరైనా కనబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు. కొత్తగా ఇండ్లకు అద్దె వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకున్నాకే ఇవ్వాలని సూచించారు.

# అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

## వర్షం ముప్పు నుంచి ప్రజలకు ఇబ్బందులు తప్పించాలి
## వికారాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి దివ్యా దేవరాజన్

**వికారాబాద్, ఆగస్టు 12(ప్రజా స్వరం):**
భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ క్షేత్ర స్థాయి లో అధికారులు అందరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా స్పెషల్ అధికారి, సి ఇ ఓ సెర్ప్ దివ్యా దేవరాజన్ అన్నారు. వికారాబాద్ జిల్లాలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నందున భారీ వర్షాల నుంచి ప్రజలకు ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని కోరారు. వికారాబాద్ జిల్లా అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా లో నిరంతర వర్షాల దృష్ట్యా భారి వర్షాలు వస్తే అత్యవసర సమయాలలో అందరు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ సమన్వయము తో ముందుకేల్లలని అన్నారు. ఓవర్ ఫ్లో అవుతున్న చెరువులు,వాగుల లో ప్రజలు వరద ప్రవాహాలు ఎక్కువగా ఉన్న చోట జాగ్రతలు పాటించాలని తెలిపారు. జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో చెరువులు కుంటలు వాగులు పొంగి పొర్లాటంతో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు .వాగులు వంతెనల వద్ద ప్రమాదము పొంచి ఉన్న వాటి దగ్గరకు వెళ్లనీయకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ,ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని, అధికారులకు ఆదేశించారు. జిల్లాలో గల పాఠశాలల్లో రెసిడెన్షియల్ మరియు గురుకుల పాఠశాలల్లో వసతి గృహాలలో పైకప్పు నుండి వర్షం కారణంగా నీరు వచ్చినట్టయితే అధికారులు గమనించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని, పాత బడిన బవనాలను గుర్తించి ప్రజలకు ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరుగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటూ మురుగునీరు మరియు వర్షపు నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ,ఎలాంటి రోగాలు ప్రబలకుండా వైద్య అధికారులు అందుబాటులో ఉండి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకొని అంటువ్యాధులు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వైద్య అధికారులకు ఆదేశించారు. ఆరోగ్యపరంగా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉండి మలేరియా వంటి జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని , పాము కాటుకు మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పట్టణాలలో , గ్రామాలలో శానిటేషన్, బ్లీచింగ్ చేయడం మున్సిపల్ కమిషనర్లు , ఏం పి డి ఓ లు చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల వారిగా అధికారులు వర్షాల కారణంగా జిల్లా లో చేస్తున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ , అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్ డి ఓ సుదీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# నేడు మండల స్థాయి పాఠశాలల బోధనోపకరణాల మేళా



**మెదక్ ఆగస్టు 12 (ప్రజా స్వరం) :**
విద్యా బోధనలో భాగంగా బుధవారం మెదక్ మండల స్థాయి పాఠశాలల బోధనోపకరణాల మేళా కార్యక్రమం మెదక్ జిల్లా కేంద్రంలోని న్యూ హైస్కూల్ లో ఉదయం 9 గంటల నుండి ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖాధికారి శంకర్ తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రం న్యూ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ఈ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మన జిల్లా విద్యాశాఖాధికారి హాజరు కానున్నారని అన్నారు. మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విధిగా తమ పాఠశాలలో తయారు చేసిన బోధనోపకరణాలతో హాజరై బోదనోపకరణాలను ప్రదర్శించి మేళా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మీడియా కమిటీ సభ్యులు మెరుగు నరేందర్, ఎన్ సత్యనారాయణ, సత్యనారాయణ, నర్సింహులు, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



# దేశ ఖ్యాతిని చాటేలా.. వాడవాడల్లో జాతీయ జెండా ఎగరాలి

**నిజాంపేట. 12.( ప్రజా సర్వం) :**
మెదక్ జిల్లానిజాంపేట మండలంలో కుల మతాలు, పార్టీలకతీతంగా దేశ ఖ్యాతిని చాటేలా వాడవాడలో జాతీయ జెండా ఎగురవేయాలని బిజెపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం రోజున ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే పార్టీలకతీతంగా పురవీధుల్లో భరతమాత కీర్తి ప్రతాపాన్ని చాటుతూ తిరంగ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటి చెప్పే విధంగా ప్రతి ఒక్కరు తమ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయాలని పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతంతో ప్రపంచానికి భారతీయుల సత్తా తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనివాస్, వెల్మల సిద్ధ రాములు, తీగల శ్రీనివాస్ గౌడ్, ఆకుల రమేష్, నరేష్ మహంకాళి,సిద్ధ రాంరెడ్డి ఉన్నారు.

# వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



**శామీర్ పేట ఆగస్టు 12(ప్రజాస్వరం):**
రాఘవేంద్ర స్వామి ఆరాధ నోత్సవాలు వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య ఘనంగా ముగిశాయి. సోమవారం శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోని గాయత్రి మహాక్షేత్రంలో రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనోత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు, వాక్ బ్రహ్మ,శిశ్యజనోద్ధారక, రాఘవేంద్ర స్వామి ఉపాసకులు డాక్టర్ ఎస్ఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి ఆరాధన ఉత్సవాలలో ఈరోజు ముఖ్యమైన రోజు అని తెలిపారు. స్వామి వారు బృందావనం నుంచి బయటకు వచ్చి భక్తులకు ఆశీస్సులు అందించిన రోజని చెప్పారు. వేదబ్రహ్మణుల మంత్రోచ్చరణలమధ్య ప్రధానార్చకులు రాఘవేంద్ర పండితుడు స్వామివారికి ఉదయం నుంచి మలరాధన నిర్మాల్య విసర్జన, ఫలపంచామృత అభిషేకం, పాదపూజ, కనకాభిషేకము, తులసి అర్చన, హస్తోదకం, తీర్ధప్రసాద వితరణ, భోజన కార్యక్రమం, సాయంత్రం పల్లకి సేవా, రథోత్సవం, అష్టావధానసేవా, మంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల భక్తులతో పాటు నగరానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బియ్యం డెలివరీలను వేగం పెంచాలి

## రెవెన్యూ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



**వికారాబాద్, ఆగస్టు 12(ప్రజా స్వరం) :**
రబీ 202425 సీజన్కు సంబంధించి బకాయిలో ఉన్న కస్టమ్ మిల్లింగ్ బియ్యం ను మిల్లర్లు తక్షణమే పూర్తిగా అందజేయాలని, అలాగే ఖరీఫ్ రబీ 202526 సీజన్లకు సంబంధించిన బియ్యం డెలివరీలను వేగవంతం చేయాలని రెవిన్యూ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్లో నిర్వహించిన రైస్ మిల్లర్ల జిల్లా సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లర్లు తమ మిల్లు సామర్థ్యం మేరకు బియ్యాన్ని ఎఫ్సీఐకి సమయానికి అందజేయాలని కోరారు. అలాగే మిల్లర్లు తమకు అప్పగించిన ధాన్యం పరిమాణానికి తగినట్టుగా బియ్యం సరఫరా చేసుకోవాలని, తమ బాధ్యతగా భావించాలని ఆయన మిల్లర్లకు సూచించారు. ఎఫ్సీఐ అధికారులు డెలివరీలకు అనుగుణంగా తగిన సంఖ్యలో గోదాములను ఏర్పాటు చేసి, జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలి అని పేర్కొన్నారు.గోదాముల్లో సరైన తరలింపు కోసం తగినంత మంది హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆయన కోరారు. , అలాగే బియ్యం నిల్వ మరియు రవాణా సదుపాయం కలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో ,డి ఎం సి ఎస్ మోహన్ కృష్ణ, డి ఎస్ ఓ సుదర్శన్ మరియు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



# అప్రమంతంగా ఉండాలి

## కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్ ఆగస్టు 12 (ప్రజాస్వరం):**
హైదరాబాద్ లో రాబోయే 3 రోజులు, ఆగస్టు 13 బుధవారం నుండి ఆగస్టు 15 శుక్రవారం వరకు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలకు అనుగుణంగా హైదరాబాద్ లోని ఉత్తర ప్రాంతాలు (మేడ్చల్ జిల్లా, సైబరాబాద్ ప్రాంతం మొదలైనవి) ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని మేడ్చల మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. హైదరాబాద్ లోని ఇతర ప్రాంతాలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 10/15 సెం.మీ కంటే ఎక్కువ, కొన్ని చోట్ల 20 సెం.మీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నది. కాబట్టి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి మరియు రాబోయే 3 రోజులు వాహనాల రాకపోకలను తగ్గించుకోవాలని. లోతట్టు ప్రాంతాల ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# రేషన్ కార్డులు పంపిణీ

**రామయంపేట. 12.( ప్రజా సర్వం) :**
మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో 10 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ కనీసం నిరుపేదలకు రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మరి రమేష్ చారి అన్నారు. రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో మంగళవారం కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన 50 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేశారు. గ్రామానికి చెందిన 150 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డు జాబితాలో చేర్పించినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మరి రమేష్ చారి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్, గ్రామ ఉపాధ్యక్షులు బాలయ్య, ప్రధాన కార్యదర్శి మద్దూరి సిద్ధరాములు, కాంగ్రెస్ నాయకులు సిద్ధిరాములు, మహేందర్ రెడ్డి, ఎల్లం, కిష్టయ్య, సంజీవులు, రాకేష్, కమల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలపై సీఐ శ్రీనాథ్ అవగాహన




**శామీర్ పేట, ఆగస్టు 12, (ప్రజాస్వరం) :**
వినాయక చవితి సందర్భంగా మంగళవారం శామీర్ పేట మండలంలోని ప్రజలకు, వినాయక విగ్రహాలు ప్రతిష్టించే వారికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాలు నిర్మించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ తీగలు, కరెంట్ స్తంభాల విషయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వినాయక చవితి అనేది ఒక విశిష్టమైన పండుగ కావున, పండుగ జరుపుకునే సమయంలో ఇతరులకు అసౌకర్యం కలగకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అలాగే, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టితో తయారు చేసిన గణపతులను ప్రతిష్టించాలని ప్రజలకు సూచించారు. పోలీసు వారి సహకారం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నేరుగా ఇన్స్పెక్టర్, లేదా 100 నంబరుకు ఫోన్ చేయాలని ప్రజలకు తెలియజేశారు. పండుగను సుఖసంతోషాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడమే అందరి బాధ్యత అని చెప్పారు. ఈ అవగాహన సమావేశంలో శామీర్ పేట మండల ప్రజలు, ఎస్ఐలు దశరథ్, శశివర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్టులు

**నిజాంపేట. 12.( ప్రజా సర్వం) :**
మెదక్ జిల్లా నిజాంపేట మండలం ఏబీవీపీ నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించడం దారుణం అని ఏబీవీపీ రాష్ట నాయకులుబండారి ప్రశాంత్ అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏబీవీపీ ఎలాంటి కార్యక్రమానికి పిలుపునివ్వకుండా పోలీసులు అర్ధరాత్రి నుండి ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ కు చేయడం సిగ్గుచేటు అని. ఈ అక్రమ అరెస్టులకు కేసులకు భయపడి లేదని విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టుకు రాష్ట్ర ఏబీవీపీ పక్షాన ఖండిస్తున్నామన్నారు.



## వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలించిన డీసీపీ

**శామీర్ పేట ఆగస్టు 12(ప్రజాస్వరం)**



రాబోయే వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు శామీర్ పేట్ పెద్ద చెరువును మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి సందర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిమజ్జన సమయంలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష చేపట్టారు. డీసీపీ పండుగను శాంతియుత వాతావరణంలో, సురక్షితంగా నిర్వహించేందుకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనాథ్, ఎస్సై శివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల అరెస్ట్

**మెదక్ ఆగస్టు 12 (ప్రజా స్వరం) :**




హైదరాబాద్ లో పెద్దమ్మ గుడి కూల్చివేతకు నిరసనగా మంగళవారం పెద్దమ్మ గుడి సందర్శనకు వెళ్తున్న బిజెపి నాయకులను అక్రమ అరెస్టు చేసి మెదక్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇందులో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బక్కవారి శివ, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు భాను, యువ మోర్చ పట్టణ అధ్యక్షుడు లింగరాజు ఉన్నారు.

## క్లస్టర్ వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

**వికారాబాద్, ఆగస్టు 12(ప్రజా స్వరం) :**



జిల్లాకు గ్రామ పంచాయతీ అధికారులు రాబోతున్నందున క్లస్టర్ వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలనీ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. మంగళవారం తన ఛాంబర్ లో అన్ని మండలాల తహసీల్దార్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జి పి ఓ ల నియామకం జరుగబోతున్నందున మండలాలో క్లస్టర్ వారీగా గ్రామాలను గుర్తించి ఒక క్లస్టర్ లో ఎన్ని గ్రామాలు ఉంటాయి, వాటిని గుర్తించి ప్రణాళిక లు సిద్ధం చేయాలనీ ఆదేశించారు. మండలాల తహసీల్దార్ లు అందరు మీ పరిధిలో ఉండే మీ సేవ సెంటర్ లను తనిఖీ చేయాలనీ, సెంటర్ లలో జరిగే పనులపై వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఈ సమావేశం లో ఆర్ డి ఓ వాసు చంద్ర, అన్ని మండలాల తహసీల్దార్ లు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లో ఏసీబీ కలకలం

**వికారాబాద్, ఆగస్టు 12(ప్రజా స్వరం) :**



వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో రెవిన్యూ సెక్షన్లలో పనిచేస్తున్న సుజాత అనే మహిళా ఉద్యోగిని రూ. 15 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు.జిల్లా లోని నవాబుపేట మండలం తహఃసిల్దార్ కార్యాలయానికి ప్రొసీడింగ్ కాపీ పంపించడానికి రూ. 15 వేల డిమాండ్ చేసిన సుజాత. ఈ కేసు వివరాలను ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ తెలిపారు.

## సీతారాం ఏచూరి ఆశయాల కోసం ఉద్యమించాలి




**మెదక్ ఆగస్టు 12 (ప్రజా స్వరం) :**

సీతారాం ఏచూరి 73వ జయంతి పురస్కరించుకొని మంగళవారం మెదక్ జిల్లా కేంద్రం కేవలం కిషన్ భవన్ లో సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సంతోష్ మాట్లాడుతూ 1974లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లో సభ్యుడిగా ఏచూరి సీతారాం రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందనీ అన్నారు. ఆ మరుసటి ఏడాదే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సభ్యునిగా చేరారని, అత్యవసర పరిస్థితికి కొంతకాలం ముందు ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారాని అన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితి ఎత్తివేసిన తర్వాత జేఎన్‌యూ విద్యార్థి నాయకునిగా సీతారాం ఏచూరి మూడు సార్లు ఎన్నికయ్యారని, 1978లో అఖిల భారత ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షునిగా ఎన్నికయ్యారని అన్నారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి, సీపీఎం ప్రధాన కార్యదర్శి అయ్యారని, 1985లో భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలో, 1988లో కేంద్ర కార్యవర్గంలో, 1999లో పొలిట్ బ్యూరోలో ఏచూరికి చోటు దక్కిందని తెలిపారు. 2005లో బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన అనంతరం పార్లమెంటు దృష్టికి ఎన్నో ముఖ్యమైన సమస్యలను తీసుకురావటంతో పాటు వాటిపై ప్రశ్నలు సంధించిన సభ్యునిగా రాజ్యసభలో ఏచూరి గుర్తింపు పొందారని అన్నారు. 2015 మార్చి 3న బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానానికి రాజ్యసభలో ఏచూరి సవరణలు ప్రతిపాదించారని అన్నారు. దీనిపై జరిగిన ఓటింగ్‌లో ఆయన సవరణ ప్రతిపాదన నెగ్గిందని అన్నారు. సీతారాం ఏచూరి ఆశయాల కోసం మరిన్ని ఉద్యమించాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, రాణి, అమూల్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ

**శామీర్ పేట, ఆగస్టు12(ప్రజాస్వరం) :**

శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం తరపున శామీర్ పేట గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా పల్లవి ప్రోగ్రెసివ్ హై స్కూల్ కు చెందిన మాధవరెడ్డి దంపతులు 25 కిలోల బియ్యం అందజేశారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

### ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్

**మెదక్, ఆగస్టు 12 (ప్రజా స్వరం) :**



తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని జికెఆర్ గార్డెన్స్ లో మెదక్ నియోజకవర్గం లోని 223 మంది లబ్ధిదారులకు 63 లక్షల విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన విదంగా ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు.అన్నదాతలకు రైతు భరోసా, రుణమాఫీ అందజేసినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు కళ్ళలాంటివని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నియోజకవర్గం లో మౌళిక వసతుల కల్పన కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు తెచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మెదక్ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి కష్ట సుఖాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. రామాయంపేట పట్టణంలో 200కోట్ల తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ లో ప్రసిద్ధి గాంచిన ఏడుపాయల దుర్గ భవాని టెంపుల్, ప్రపంచంలో ప్రసిద్ధి గాంచిన మెదక్ చర్చి ల అభివృద్ధి కి గత ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, శంకర్, బ్లాక్ కాంగ్రెస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొజ్జ పవన్, శ్రీనివాస్ చౌదరి,మహేందర్ రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు గౌడ్, లింగం, శంకర్, రాజిరెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్ క్రిష్ణ, కోర్వి రాములు, హంజాద్, లల్లూ, మహిపాల్ యూత్ కాంగ్రెస్ మెదక్ నియోజకవర్గ అధ్యక్షులు భరత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## తాండూరు సమస్యలపై సీఎంకి బుయ్యని వినతి

**తాండూరు, ఆగస్టు 12(ప్రజా స్వరం) :**

హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డి ని వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్ళారు. తాండూరు పట్టణ శివారులో బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు నష్ట పరిహారంగా రూ. 25 కోట్లు మరియు కాగ్న నదిలో ఉన్న త్రాగునీటి పైపులైన్ పునరుద్ధరణ కోసం దాదాపు రూ.50 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ని కోరగా సానుకూలంగా స్పందించి, త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామి ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థులు ఇష్టంతో చదివాలి

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

**శామీర్ పేట ఆగస్టు12(ప్రజాస్వరం):**



మీ కలలను నిజం చేసుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడం మీ చేతుల్లోనే ఉందని, మీరు లక్ష్యాన్ని ఏర్పరచుకొని అందుకు క్రమశిక్షణ, ప్రణాళిక బద్ధంగా కార్యచరణతో బాగా కష్టపడుతూ ఇష్టంగా చదివి సాధించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా విద్యార్థులకు బోధించారు. మంగళవారం మేడ్చల్ మండలం కిష్టాపూర్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ మీ కలలను నిజం చేసుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడానికి మీరు బాగా కష్టపడి చదవాలని, అందుకు అవసరమైన అన్ని విధాల సహాయ సహాకారాలు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వారి సబ్జెక్టుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొని, వారికి అవసరమైన మార్గనిర్దేశ సూచనలు చేశారు. రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు, విద్యార్థులు స్పందిస్తూ కంప్యూటర్లు, ల్యాబ్ కావాలని తెలుపగా, అదనపు కలెక్టరు తప్పకుండా సమకూరుస్తామని తెలిపారు. స్కూల్, కాలేజీ మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని, అన్ని సౌకర్యాలు ఉన్నాయా ఏమైనా మరమ్మత్తులు అవసరమా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తున్నారా అని అదనపు కలెక్టరు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

**రామాయంపేట. 12.( ప్రజా సర్వం ) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండలలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రామాయంపేట ఎస్సై బాలరాజు అన్నారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, అక్కన్నపేటలోని రైల్వే స్టేషన్ ను మంగళవారం జిల్లా ఎస్పీ డివి రాజు ఆదేశాల మేరకు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ చేపట్టారు. ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ ఈ తనిఖీలు కొనసాగాయి, ప్రజల్లో అభద్రతాభావం పోగొట్టడం, డ్రగ్స్, మత్తు పదార్థాల అక్రమ రవాణా, పేలుడు పదార్థాల అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. మత్తు పదార్థాలు అక్రమ రవాణా చేసిన, విక్రయించిన, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఎక్కడైనా మత్తు పదార్థాలు అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి



### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి, ఆగష్టు 12(ప్రజా స్వరం):**

రైతులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కోరారు. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో మంగళ వారం పరిగి ఎమ్మెల్యే డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పరిగి నియోజకవర్గంలోని విద్యుత్ సరఫరా సమస్యలపై నియోజక వర్గంలో పరిగి, దోమ, కుల్కచెర్ల, గండేడ్ మండలాల విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల్లోని గ్రామల ప్రజలు లిఖితపూర్వకంగా తమ గ్రామాల విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.వాటిని పరిశీలించి, సంబంధిత అధికారులకు అందించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి, రైతులు మరియు ప్రజలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ట్రాన్స్కో హైదరాబాద్ సర్కిల్ ఎస్ సీ వికారాబాద్ డీఈ పరిగి ఏడి, ఏఈలు పాల్గొన్నారు.




## అధికారులు సమన్వయంతో పని చేయాలి

### జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి

**వికారాబాద్,(ప్రజా స్వరం) :**

వీడియో కాన్ఫరెన్సు అనంతరము జిల్లా ఎస్పి నారాయణ రెడ్డి మాట్లాడుతూ సి యం సూచనల మేరకు అధికారులు ,సిబ్బంది అందరు అందుబాటులో ఉండి భారి వర్షాల నేపథ్యంలో జిల్లా లో ఎలాంటి ప్రాణ నష్టం, పశువుల నష్టం, జరుగకుండా అన్ని శాఖల సమన్వయం తో పని చేయాలనీ అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని , 08416235291 7995061192 నెంబర్లు ఏర్పాటు చేసి 24గంటలు సిబంది షిఫ్టుల వారిగా డ్యూటీ లో ఉంటారని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**నిజాంపేట. 12. (ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంతో పాటు కల్వకుంట గ్రామంలో మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అంగన్వాడి సెంటర్లు, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా పర్యటించి పలు రికార్డులను పరిశీలించి విద్యార్థులకు విద్యాబోధన ఎలా అందిస్తున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుంటలో సబ్ సెంటర్ ప్రైమరీ, అంగన్వాడి సెంటర్ ను సందర్శించామన్నారు.ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు చదువులో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. అంగన్వాడి సెంటర్ లో పౌష్టికాహార లోపం ఒకరే ఉన్నారని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అంగన్వాడి నిర్వాహకులకు సూచించారు. అలాగే గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. మొదటి విడుదల లక్ష రూపాయలు వారి అకౌంట్లో జమకు అవుతున్నాయని త్వరతగతిన ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నట్లయితే విడుదలవారీగా వారి అకౌంట్లో డబ్బులు జమవుతాయి అని తెలిపారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించినట్లయితే ప్రాణాంతకమైన వ్యాధులు దరిచేరమన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి కవిత, వెంకట నరసింహారెడ్డి పాల్గొన్నారు.



# బాలరాజు బాటలో అబ్రహం



మహబూబ్ నగర్, ఆగస్టు 12, (ప్రజా స్వరం)

తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉన్న అలంపూర్ నియోజకవర్గం ఎప్పుడు రాజకీయ మ లుపులో ప్రత్యేకతను చాటుకుంటూనే వ స్తుంది. మాజీ ఎమ్మెల్యే అబ్రహం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ తన అ నుచర వర్గం మాత్రం బిజెపి వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు బిజెపి దక్షిణాది రాష్ట్రాల్లో తన వశం చేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్ళుతు ఆంధ్రప్రదేశ్లో ఇప్పటికే పొత్తులో భాగంగా అధికారంలోకి రాగా తెలంగాణ రాజకీయా ల వైపు పాగా వేయాలని అడుగులు వేస్తుంది. టిఆర్ఎస్ పార్టీలో పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన వారితోపాటు కాంగ్రెస్ లో ఉన్న అసంతృప్తి నా యకులను ఆకర్షించేందుకు పావులను కదుపుతుంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వ ల బాలరాజు ఇప్పటికే బిఆర్ఎస్ పా ర్టీని వీ డి బిజెపి పార్టీలోకి చేరగా గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది తన ప్రజా బలాన్ని ఆకర్షించే నేతగా అబ్రహం ఏదిగారు. గత ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ నుండి టికెట్ ని ఆశించి తీవ్రంగా శ్రమించిన ఆయనకు విజేయుదు రూపంలో అదృష్టం చేజారింది. నువ్వా నేనా అంటూ ఉద్రిక్త భరితంగా చివరి వరకు టికెట్ వస్తుందని ఆశించిన ఆయనకు చల్లా వెంకట్రామిరెడ్డి ఆశీస్సు లు కోల్పోయి టికెట్టు దగ్గకపోవడంతో ఆ యన భంగపడ్డారు. దీంతో వెంటనే తనని కాదని పార్టీ టికెట్ ఇచ్చిన విజేయుదు ను ఓ డించేందుకు ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎ మ్మెల్యే సంపత్ కుమార్ గెలుపు కోసం చే తులు కలిపి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో స్వల్ప మెజార్టీతో ఓడిన సంపత్ కుమార్ వద్ద క్రమంగా ప్రత్యక్ష రాజకీయాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. క్రమంగా పార్టీ కార్యక్రమాలు సభలు సమావేశంలో హాజరు కావడం లేద ని ప్రచారం లో ఉంది. తన రాజకీయ జీవితంలో తన వారసుడు మమకమై తన వెను క ఉండి చూసుకున్న తన కొడుకును తన రా జకీయ వారసుడిగా ప్రజలకు పరిచయం చే యాలనుకున్న తరుణంలో బిఆర్ ఎస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోవడంతో తన కొడుకు రాజకీయ జీవితం ఎలాగైనా చక్కపెట్టాలన్న ఆలోచనతో బిజెపిలోకి అడుగులు పెట్టేందు కు యోచిస్తున్నట్లు తన సన్నిత వర్గాల ద్వా రా తెలిసింది.ఇప్పటికే బిజెపి ముఖ్య నాయకులతో సంప్రదింపులు జరిగినట్లు ప్రచార సైతం జోరుగా వినిపిస్తోంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలోకి అడుగు పెట్టిన వెంటనే సాధ్య అసా ధ్యాలపై పరిస్థితులను అంచనా వేసి ముం దుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టమవుతుంది. పరోపక్క తను పార్టీ మారుతున్నట్లు లీకులు ఇచ్చిన వెంటనే తనను కాంగ్రెస్ పా ర్టీ బుజ్జగిస్తుందా అన్న ఆశతో కూడా ఉన్నట్లు తెలుస్తోంది.కాబోయే స్థానిక సం స్థల ఎన్నికల్లో తన కుమారుడికి క్రియాశీల పదవి ఇస్తారని ఆశతో ఉన్నట్టు ప్రచారం జోరుగా వినిపిస్తుంది. పేదల డాక్టర్ గా, వివాదరహితుడిగా ఉన్న డాక్టర్ అబ్రహం 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అబ్రహం అనుచరులు, అభిమానులు రాజకీయంగా తగిన నిర్ణయం తీసుకోవాలని అబ్రహం పై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. పలు మండలాల నాయకులు మంతనాలు చేస్తుండ డంతో వేచి చూద్దాం అన్న ధోరణిలో మాజీ ఎమ్మెల్యే ఉన్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో నడిగడ్డకు చెందిన బీజేపీ ముఖ్య నేతలు రంగంలోకి దిగి అబ్రహంను బీజేపీలోకి రావలసిందిగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది.స్థానిక సంస్థల ఎన్నికల లోపు నిర్ణయం తీసుకోవాలని కొంతమంది సూచిస్తుంటే.. మరి కొంతమంది స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత నిర్ణయాలు తీసుకుంటే బా గుంటుంది అని మరి కొంతమంది మాజీ ఎమ్మెల్యేకు సూచిస్తున్నట్లు సమాచారం. మొత్తం పైన డాక్టర్ అబ్రహం భారతీయ జనతా పార్టీలోనే చేరే అవకాశాలు ఉన్నాయని నియోజకవర్గంలో జోరుగా ప్రచారంజరుగుతోంది.

# రాజగోపాలరెడ్డి పదవికి అడ్డుకుంటున్నెదవరు



నల్గొండ, ఆగస్టు 12, (ప్రజాస్వరం )

కాంగ్రెస్ అధిష్ఠానం నాకిచ్చిన మంత్రిపదవి హామీని అమలుచేయకుండా రాష్ట్ర ముఖ్యనేతలు అడ్డుకుంటూ, అవమానిస్తున్నారు. వాస్తవాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా ద్వారా ప్రజలకు వివరించినందుకు ధన్యవాదాలు' అని మును గోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని.. ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ అమలు చేయాలని కోరా రు.అవినీతిరహిత పాలన అందించాలం టూ సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిన మాట నిజమేనని డిప్యూ టీ సీఎం భట్టి విక్రమార్క ఓ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్న అం శంపై రాజగోపాల్‌రెడ్డి స్పందించారు. తనకు మంత్రి పదవి రాకుండా కొందరు నేతలు అడ్డుకుంటున్నారనే వాస్తవాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బయటపెట్టారని తెలిపారు. తెలంగాణ సమాజ ఆకాంక్షలను నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని తాను ఆశిస్తున్నట్టు రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. గత కొన్నిరోజులుగా రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవి అంశం తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన పలుమార్లు విమర్శలు కూడా చేశారు.

**పార్టీ వేటు తప్పదా**

మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి బిగ్ షాక్ తగిలింది. సీఎం రేవంత్‌రెడ్డిని పదేపదే టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్న రాజగోపాల్ రెడ్డిని పార్టీలో నుంచి పంపేందుకు రంగం సిద్ధం అయినట్లుగా తెలుస్తోంది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశాలతో పాటుగా ప్రధానంగా రాజగోపాల్ వ్యవహారంపై సీఎం చర్చించినట్లుగా తెలుస్తోంది. రాజగోపాల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకునే ప్లాన్‌లో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం.అటు సీఎం రేవంత్‌రెడ్డిపై కోమటిరెడ్డి బహిరంగంగా చేసిన విమర్శలపై పార్టీ హైకమాండ్‌కు కూడా నివేదికలు వెళ్లాయి. ఏఐసీసీ కూడా ఈ విషయంపై ఆరా తీసినట్లు తెలుస్తోంది.పార్టీ అంతర్గత వ్యవహారాలను బహిరంగంగా చర్చించడం సరికాదని క్రమశిక్షణ కమిటీ భావిస్తోంది. పార్టీకి నష్టం జరగకుండా ఈ అంశాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని అధిష్ఠానం చూస్తున్నట్లు సమాచారం. అయితే రాజగోపాల్ రెడ్డిపై క్రమశిక్షణ కమిటి వేటు వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక తనకు మంత్రి పదవి రాకపోవడంపై రాజగోపాల్ రెడ్డి అసంతృప్తిగా ఉన్నారని, అందుకే సొంత పార్టీ నేతలపై విమర్శలు చేస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హైదరాబాద్ వచ్చినప్పుడు రాజగోపాల్ రెడ్డి ఆయనతో భేటీ అయ్యారు. ఈ భేటీ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఇప్పటికే ఎంపీ మల్లు రవి కూడా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో చేరేటప్పుడు తనకు మంత్రి పదవి ఇస్తామని పార్టీ నాయకత్వం హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీని రాష్ట్ర ముఖ్య నేతలు అడ్డుకుంటున్నారని రాజగోపాల్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా హైకమాండ్ రాజగోపాల్ రెడ్డికి పదవిపై హామీ ఇచ్చిన మాట వాస్తవేమేనని కానీ అది కేబినెట్ కూర్పులో కుదరలేదన్నారు. దీనిపై రాజగోపాల్ రెడ్డి డిప్యూటీ సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ ట్వీట్ చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని చేసిన వ్యాఖ్యలను రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా ఖండించారు. ముఖ్యమంత్రి ఎవరు అనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని, ఇలాంటి వ్యాఖ్యలు పార్టీ విధానాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, ప్రతిపక్షాలపై సీఎం ఉపయోగించే భాషను మార్చుకోవాలని కూడా సూచించారు.

# రఘునందనరావుకు ఆగని బెదిరింపులు

మెదక్, ఆగస్టు 12, (ప్రజాస్వరం)



తెలంగాణకు చెందిన ఓ ఎంపీకి మూడు నెలలుగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. అంతకు ముందు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు కూడా ఇలాగే బెదిరింపు కాల్స్ వచ్చేవి. ఫోన్ చేసిన అగంతకులు ఇద్దరికీ చంపేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇప్పుడ రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్ తగ్గాయి. మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు పెరిగాయి మూడు నెలల్లో ఆరుసార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయి. గతంలో రాజాసింగ్‌కు ఫోన్ చేసిన అగంతకులను పోలీసులు పట్టుకోలేదు. ఆయనకు దుబాయ్ నుంచి కాల్స్ వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. కానీ, ఎవరినీ పట్టుకోలేదు. ఇక మెదక్ ఎంపీకి వస్తున్న బెదిరింపు కాల్స్ మధ్యప్రదేశ్ నుంచి వస్తున్నట్లు మాత్రం గుర్తించారు. కానీ, ఇప్పటి వరకు ఎవరినీ పట్టుకోలేదు. దీంతో అగంతకులు రెచ్చిపోతున్నారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోనే ఉన్నామని, సాయంత్రం వరకు చంపేస్తామని హెచ్చరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరినీ పట్టుకోలేదు. తెలంగాణ పోలీసులు లేదా కేంద్ర నిఘా సంస్థలు దుండగులను గుర్తించడంలో విఫలమవుతున్నాయి. అత్యాధునిక సాంకేతికత, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లు అందుబాటులో ఉన్నా దుండగులను గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.రఘునందన్ రావు గత జూన్ నుంచి ఆరు బెదిరింపు కాల్స్ వచ్చాయి. వీటిలో కొన్ని మావోయిస్టుల పేరుతో వచ్చాయి. ఈ కాల్స్‌లో దుండగులు ఆయనను సాయంత్రం లోగా చంపేస్తామని, హైదరాబాద్‌లోనే ఉన్నామని బెదిరించారు. కొన్ని సందర్భాల్లో, ఆంధ్రప్రదేశ్ మావోయిస్టు కమిటీ ఆదేశాల మేరకు ఐదు బృందాలు ఆయనను లక్ష్యంగా చేసుకున్నాయని కూడా చెప్పారు. ఈ బెదిరింపులు ఛత్తీస్‌గఢ్‌లోని ఆపరేషన్ కాగర్‌కు ప్రతీకారంగా ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అయితే, ఈ కాల్స్ వెనుక నిజమైన ఉద్దేశం లేదా గుర్తింపు ఇంతవరకు స్పష్టంగా తెలియలేదుతెలంగాణ ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్, అత్యాధునిక సాంకేతికతను పోలీసులకు అందుబాటులోకి తెచ్చినప్పటికీ, ఈ కేసులో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. కాల్స్ మధ్యప్రదేశ్ నుంచి వస్తున్నట్లు గుర్తించినప్పటికీ, దుండగులను ట్రేస్ చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారు. కాల్స్ ఇంటర్నెట్ ఆధారిత సేవల ద్వారా వస్తున్నాయని, దీనివల్ల దుండగుల వివరాలను గుర్తించడం కష్టమవుతోందని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. తెలంగాణ, మధ్యప్రదేశ్ పోలీసుల మధ్య సమన్వయం సరిగా లేదని తెలుస్తోంది. కొందరు ఈ వైఫల్యం వెనుక రాజకీయ కారణాలు ఉండవచ్చని, దుండగులను కావాలనే పట్టుకోవడం లేదని అనుమానిస్తున్నారు.బెదిరింపుల నేపథ్యంలో రఘునందన్ రావుకు పోలీసులు భద్రతను కల్పించారు. సాయుధ సిబ్బంది, ఎస్కార్ట్ వాహనం అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ, వరుస బెదిరింపులు ఆయన అనుయాయులు, పార్టీ కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఘటనలు రాజకీయ నాయకుల భద్రతపై ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ముఖ్యంగా, ఒక ఎంపీకి వస్తున్న బెదిరింపులను నియంత్రించలేనప్పుడు సామాన్య పౌరుల భద్రత గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

# సమాధులపైనే చెత్త పడేస్తున్నారు


అదిలాబాద్, ఆగస్టు 12, (ప్రజాస్వరం)



శ్మశాన వాటికలు, డంపు యార్డులుగా మారిన దృష్టాంతం ఎక్కడా కనిపించదూ. స్మశాన వాటికలో ఎక్కడైనా సమాధులే ఉంటాయి. కానీ బెల్లంపల్లిలో మాత్రం శ్మశాన వాటికలో సమాధులతో పాటుగా చెత్త కుప్పలూ ఉండడం రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో ఎరుగం. ఈ విచిత్ర పరిస్థితి బెల్లంపల్లి బల్దియాలో మాత్రమే తాండవిస్తోంది.మంచిర్యాల జిల్లా రెండవశ్రేణి గ్రేడ్ బెల్లంపల్లి మున్సిపాలిటీకి డంపుయార్డు కష్టాలు వీడటం లేదు. డంపుయార్డు సౌక ర్యం లేక ఎక్కడబడితే అక్కడ చెత్తను పడేస్తున్నారు. ఈ పని చేసేది ప్రజలు కాదు... అధికారుల ఆదేశం మేరకు సాక్షాత్తు మున్సిపల్ పారిశుద్ధ సిబ్బంది చేయడం గమ నార్హం. ఇలా పారిశుధ్య సిబ్బంది వ్యవహరించడానికి ప్రధాన కారణం డంపు యార్డు లేకపోవడమే.కాగా మున్సిపల్ అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడమే ఇందుకు ప్రధాన కారణం అన్న విమర్శలు వారిపై ఉన్నాయి. పారిశ్రామిక ప్రాంతమైన బెల్లంపల్లి మున్సిపాలిటీలో డంపు యార్డు లేకపోవడం మరీ విడ్డూరంగా ఉందని పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో 34 వార్డులు ఉన్నాయి. కాగా వార్డుల రీత్యా మున్సిపాలిటీ గరిష్ట స్థాయిని సూచిస్తోంది.డంప్ యార్డుపై పురపాలక మండలకి ఏమాత్రం పట్టింపు కనిపించడం లేదన్న విమర్శలు సర్వత్రావ్యక్తం మవుతున్నాయి. పట్టణంలోని 34 వార్డుల్లోనూ సేకరించిన చెత్తను ఎక్కడ డంపు చేయాలో అర్థం కాని పరిస్థితిలో పారిశుద్ధ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. నిత్యం విధి నిర్వహణలో పారిశు ధ్ద్య కార్మికులు చెత్తను ఎక్కడ వేయాలో అర్థం కాని ఆగమ్యగోచారంలో పనిచేస్తున్నా రు.చేసేదేమీలేక ప్రతినిత్యం చెత్తను పట్టణ శివారులో డంపు చేసి కార్మికులు ఊపిరి పీల్చుకునే పరిస్థితిలో ఉన్నారు. సేకరించిన చెత్తను పడేయడానికి కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు.డంపు యార్డు సౌలభ్యం కొరవడి చెత్తను శ్మశాన వాటికల్లో పడేస్తున్నారు. కుప్పలు తెప్పలుగా చెత్తకుప్పలతో శ్మశాన వాటికలు కనుమరుగవుతున్నాయి. సమాధుల మీదనే చెత్తను పడేస్తున్నారు. ఇంక్లైన్ బస్తీ, కన్నాలబస్తీ, మార్కెట్ యార్డ్ వెనుకాల శ్మశాన వాటికలను ఇప్పటికే చెత్తతో నింపేశారు.పట్టణంలో ఇప్పటి వరకు అన్ని స్మశాన వాటికలు చెత్త కుప్పలతో నిండిపోయాయి. ఇక మిగిలింది గోల్ బంగ్లా శ్మశాన వాటికను అధికారులు గుత్త పట్టారు. పట్టణంలో సేకరించిన యావత్తు చెత్తను ట్రాలీలతో ఈ శ్మశాన వాటికలోనే డంపింగ్ చేస్తున్నారు. చెత్త కుప్ప లు పేరుకొని వర్షానికి తడిసి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నది. గురజాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే చెత్తను డంపు చేసిన చెత్త కుప్పలు పేరుకుపోయి ఉన్నాయి.రహదారి గుండా ప్రజలు దుర్వాసనను తట్టుకోలేక ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి నెలకొంది. అధికారుల అనాలోచితం డంప్ యార్డుకు పరిష్కారం దొరకక ప్రజలకు శాపంగా మారింది. శాశ్వత పరిష్కారం వైపు అధికారులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. 1987 మున్సిపల్ ఆవిర్భా వం తదనంతరం డంప్ యార్డును బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల శివారులో ఏర్పాటు చేశారు.ఈ డంప్ యార్డులో చెత్తను కాల్చివేయడంతో తద్వారా వచ్చే పొగ సమీపం లో ఉన్న కన్నాల బస్తి, మధునన్న నగర్, ఇందిరమ్మ కాలనీ, కొత్త బస్టాండ్ ఏరియా ప్రజలను ఊపిరి సలపనివ్వలేదు. అనునిత్యం పొగ మేఘాలు కాలనీలను కమ్మేసి నరకాన్ని చూపించాయి. పిల్లలు, వృద్దులకి ప్రాణ సంకటంగా మారింది. డంపు యార్డును ఎత్తివేయాలని ప్రజలు ఆందోళనకు దిగారు. కన్నా ల బస్తి, మధునన్ననగర్, కొత్త బస్టాండ్ ప్రజ లు దినమొక గండంగా కాలం వెళ్లి తీశారు. ప్రజలు అనారోగ్యానికి గురయ్యారు. ప్రజల ఒత్తిడి మేరకు డంపు యార్డును అధికారు లు ఎత్తివేయక తప్పలేదు. ఇక అప్పటినుంచి డంప్ యార్డ్ కు అనువైన స్థలం దొరకలేదనే వంకతో కాలయాపన అవుతూనే ఉంది.అధికారుల చిత్త శుద్ధిలేమి, నిర్లక్ష్యం వెరసి బెల్లంపల్లిలో డంపు యార్డుకి ముహూర్తం రావడం లేదు. డంపు యార్డు ఏర్పాటుపై చిత్తశుద్ధి కనపరచాలని ప్రజలు కోరుతున్నా రు. బెల్లంపల్లి శివారులో విశాలమైన ప్రభు త్వ స్థలాలు కోకోలుగా ఉన్నాయి. అధికారులకు డంపు యార్డుపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇట్టే ఫలించక మానదు. ఇకనైనా అధికారులు జాప్యం చేయకుం డా ప్రజలకు ఇబ్బంది కలగకుండా అనువైన స్థలంలో డబ్బు యార్డు ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సమాధుల్లో చెత్త కుప్ప లు నింపివేసి చేతులు దులుపుకోవడం అటుంచితే తమ జ్ఞాపక చిహ్నాలను చెత్త కుప్పలతో నిం పేసి అవమానించినట్టుగా స్థానిక ప్రజలు భావిస్తున్నారు.ఈ విషయా న్ని అధికారులు పరిగణంలోకి తీసుకోవాల్సింది ఉంది. ఇప్పటివరకు వారి మనో భా వాలను గాయపరచిన విషయాన్ని మున్సిపల్ అధికారులు తమను తాము పరిశీలించుకోవాలి. ప్రజల పట్ల వారి మనోభావాలను గౌరవించడం అధికారుల ప్రధాన విధిలో ముఖ్యమైనదిగా పలువురు వారికి గుర్తు చేస్తున్నారు

# కొంప ముంచుతున్న డేటింగ్ యాప్స్


హైదరాబాద్, ఆగస్టు 12, (ప్రజాస్వరం)




ప్రస్తుతం డేటింగ్ యాప్‌లు ఎక్కువగా ఉంటున్నాయి. ఇందులో తెలియని వ్యక్తులతో డేటింగ్ చేస్తుంటారు. చివరకు ఇదే కొంపముంచుతుంది. తాజాగా ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్‌జీబీటీ డేటింగ్ యాప్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఓ 65 ఏళ్ల వ్యక్తి ఓ యువకుడితో మాట్లాడాడు. మొదట్లో చాటింగ్ చేసుకునే వారు. ఆ తర్వాత ఓ హోటల్‌లో ఇద్దరు కలిశారు. వీరిద్దరూ కలిసి నగ్నంగా ఉన్న సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు వీరి ఫొటోలు తీసి బెదిరించారు. 65 ఏళ్ల వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేశారు. ఎన్ని సార్లు ఇచ్చినా మళ్లీ అడగడంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారుప్రస్తుతం హైదరాబాద్‌లో ఇలాంటి కేసులు పెరుగుతున్నాయి. ఇలాంటి డేటింగ్ యాప్‌లో కలిసి మోసం చేస్తున్నారు. ఎక్కువగా స్వలింగసంపర్కుల మధ్య ఇలాంటివి జరుగుతున్నాయి. సాధారణంగా ఈ ఎల్‌జీబీటీ యాప్స్‌లో లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్స్ ఉంటారు. ఇందులో ఎవరైతే ధనికులు ఉంటారో వారినే టార్గెట్ చేసి మోసం చేస్తున్నారు. వీరికి ఈ యాప్స్ ద్వారా దగ్గర అయ్యి ముగ్గులోకి దించుతున్నారు. ఆ తర్వాత వారిని హోటల్స్, ఫామ్ హౌస్‌లకు పిలిచి మత్తులోకి దించి నగ్న ఫొటోలు తీస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌కి చెందిన మరో డాక్టర్‌కు కూడా ఇలానే జరిగింది. ఒక యాప్‌లో పరిచయమైన వ్యక్తితో చాటింగ్ చేశాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి పిలవగానే ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. అక్కడ ఇద్దరూ మద్యం తాగారు.మద్యం మత్తులో ఉన్నప్పుడు, ఆ వ్యక్తి డాక్టర్ నగ్న ఫొటోలు తీశాడు. ఈ విషయం తెలియని డాక్టర్ అక్కడి నుంచి తిరిగి వచ్చాడు. కానీ కొన్ని రోజుల తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు డాక్టర్ నగ్న ఫొటోలను వాట్సాప్‌లో పంపి, బ్లాక్‌మెయిల్ చేయడం మొదలు పెట్టారు. భయపడిన డాక్టర్ మోసగాళ్లు అడిగిన డబ్బులు ఇచ్చారు. ఇలాంటి కేసులు ఎక్కువగా రావడంతో పోలీసులు వీరిపై నిఘా పెట్టారు. డేటింగ్స్, ట్రాన్స్ వారిని గుర్తిస్తున్నారు. మోసం చేసేవారు ముందుగా ఎల్‌జీబీటీ యాప్స్‌లో సభ్యత్వం తీసుకుంటారు. ఆ తర్వాత పలుకుబడి, డబ్బులు ఉన్న వారిని టార్గెట్ చేస్తారు. వారితో ప్రేమగా మాట్లాడి, స్నేహం చేసి మెల్లిగా తమ ఉచ్చులోకి లాగుతారు. ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సోషల్ మీడియా ఎక్కువ కావడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. తెలియని వ్యక్తులను కలిసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మత్తులోకి ఎక్కించి ఆ తర్వాత చీట్ చేస్తున్నారని తెలిపారు.

# రిజర్వేషన్లపై తర్జనభర్జనలు

హైదరాబాద్, ఆగస్టు 12, (ప్రజాస్వరం)



బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లా లు పడుతున్నది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. మరోవైపు ప్రత్యేకంగా తీసుకొచ్చిన ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఇది లాఉండగా రాజ్యాంగ సవరణ చేయాల్సిన కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ బిల్లుపై కొర్రీలు పెడుతుంటే, రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు, ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తున్నదని ఆరోపణలు గుప్పిస్తు న్నాయి. దీనికితోడు తమకు చట్టబద్ధమైన రిజర్వేషన్లే కావాలని బీసీలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సందిగ్ధంలో పడింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ముందు మూడు మార్గా లు ఉన్నాయి. ఒకటి రిజర్వేషన్‌ను అమలు చేస్తూ ప్రత్యేక జీవోను విడుదల చేయడం. రెండోది స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయడం. మూడోది పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించడం.ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. దీనికి తోడు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నెల 16, 17వ తేదీల్లో పీసీసీ, పీఏసీ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నందున బీసీ రిజర్వేషన్ల అంశంపై సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ముందు మూడు మార్గాలున్నప్పటికీ బీసీ రిజర్వేషన్ అంశాన్ని కొలిక్కి తీసుకొచ్చే మార్గంపై తర్జన భర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో బిల్లు పెట్టింది. ప్రత్యేకంగా ఆర్డినెన్స్ రూపొందించింది. అయితే చివరగా రిజర్వేషన్లను అమలు చేస్తూ జీవో విడుదల చేయడమే మిగిలి ఉంది. ఈ క్రమంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ జీవో విడుదల చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తుంది. అయితే గత పదేళ్లలో దాదాపు 8 రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి నిర్ణయా లు జరిగాయి.కానీ వాటిని కోర్టులు కొట్టివేయడమో లేక స్టే ఇవ్వడమో జరిగింది. అయి తే బీసీ రిజర్వేషన్ అంశాన్ని షెడ్యూల్ 9లో చేర్చితేనే కోర్టుల్లో వేసే సవాళ్లను వంద శాతం ఎదుర్కొని బీసీల రిజర్వేషన్ అంశం నిలుస్తుందని బీసీ మేధావులు చెబుతున్నారు. దీనికి తోడు షెడ్యూల్ 9లో చేర్చినా కోర్టులో సమీక్ష చేయవచ్చనే వాదన కూడా వినపడుతున్నది.రిజర్వేషన్‌కు సంబంధించిన అంశాలు రాజ్యాంగ స్వరూపానికి వ్యతి రేకంగా ఉంటేనే కొట్టేస్తామని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై న్యాయపరమైన సమీక్షకు ఆస్కా రం లేకుండా, షెడ్యూల్ 9లో పెడితేనే రిజర్వేషన్లకు రక్షణ ఉంటుందని పలువురు వాదిస్తున్నారు. సెప్టెంబర్ 30వ తేదీలోపు రిజర్వేషన్ అంశం తేల్చాలని, లేని పక్షంలో పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వ హించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం పరిస్థితుల్లో హైకోర్టు నిర్దేశించిన గడువులోగా రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయడం ఒక మార్గంగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అయితే ఎన్నికలను వాయిదా వేస్తే గ్రామా ల్లో పరిపాలన మరింత కష్టంగా మారనున్నది. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ము గిసి ఏడాదిన్నర అవుతుంది. గ్రామ పంచాయతీల్లో పాలక మండలి లేక నిధులు మం జూరు జాప్యం జరుగుతుంది. ఈ క్రమంలో గ్రామాల్లో పాలన సజావుగా సాగడం లేదు. ఈ కారణంగా గ్రామాల అభివృద్ధి కుంటుపడుతున్నది. దీంతో వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని పెద్దఎత్తున డిమాం డ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదావేసే అవకాశం లేకుండా పోయింది.వాస్తవానికి బీసీ రిజర్వేషన్ల అమలు చేసే ప్రక్రియ మొదలుపెట్టినప్పటి నుంచి కాం గ్రెస్ ప్రభుత్వం పార్టీ పరంగా రిజర్వేషన్ల అం శాన్ని ప్రస్తావిస్తూ వస్తున్నది. రిజర్వేషన్లకు ఎలాంటి అడ్డంకులు తలెత్తినా పార్టీ పరంగానైనా బీసీలకు సీట్లు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే చాలాసార్లు ప్రకటించారు. కానీ పార్టీ పరంగా ఇచ్చే రిజర్వే షన్లను బీసీలు ముక్తకంతంతో వ్యతిరేకిస్తున్నారు. ఆ రకంగా వర్తించే రిజర్వేషన్లతో బీసీలకు నష్ట మే తప్పా లాభం లేదని కుండబద్ధలు కొట్టినట్టు చెబుతున్నారు.పార్టీ పరంగా టిక్కెట్లు ఇచ్చే క్రమంలో బీసీలకు ఓడిపోయే స్థానాలను కట్టబెడతారని ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ఒక పార్టీ బీసీకి సీటు ఇచ్చి, వేరొక పార్టీ అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థికి టిక్కెట్టు ఇస్తే, వారిని ఆర్థికంగా, రాజకీయంగా బీసీలు ఎదుర్కో గల రా అని ప్రశ్నిస్తున్నారు. బీసీలతో బీసీలే పో టీ పడాలని డిమాండ్ చేస్తున్నారు. రా జ్యాంగ సవరణ, చట్టబద్ధమైన రిజర్వేషన్లతో మాత్రమే ఇది సాధ్యమవుతుందని వాదిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయం మంచిదే అయినా బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ అనివార్యమని స్పష్టం చేస్తున్నారు. బీసీలకు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చే ఆలోచన ఉన్నప్పటికీ చివరగా జీవో విడుదల చేసే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. న్యాయపరమైన సమస్యలు తలెత్తే క్రమంలో జీవో విడుదల చేసిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది.ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత న్యాయస్థానాలు జోక్యం చేసుకోవని భావిస్తున్నది. ఎవ రూ కోర్టుల్లో సవాల్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనుకుంటున్నది. ఇందులో భాగంగా బీసీ రిజర్వేషన్ల అమలు కోసం వి డుదల చేసే జీవో అంశంపై అన్ని రాజకీయ పార్టీలను సంప్రదించనున్నట్టు సమాచారం.



## సమాజ భవిష్యత్తు యువశక్తిపైనే ఉంది

- **ఈదునూరి శంకర్**
- **జాతీయ యువజన అవార్డు గ్రహీత.**

**రామగుండం,ప్రజాస్వరం**

అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈరోజు స్థానిక గోదావరిఖని శాఖ గ్రంధాలయంలో యువ మిత్ర సేవా సమితి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత ఈదునూరి శంకర్ పాల్గొని మాట్లాడుతూ మన దేశం, మన సమాజం, మన భవిష్యత్తు — ఇవన్నీ యువత శక్తిపైనే ఆధారపడి ఉన్నాయి. యువత కలలు కనాలి, ఆ కలలను కార్యరూపంలోకి తేవాలి, సమాజానికి మార్గదర్శకులు కావాలి.ఈ ప్రత్యేక దినం మనకు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, సేవా భావం అనే మూడు విలువలను గుర్తు చేస్తుంది. విద్య, సాంకేతికం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమానత్వం — ప్రతి రంగంలోనూ యువత ముందుండాలి. మన ఆలోచనలు సానుకూలంగా ఉంటే, మన కృషి నిబద్ధతతో ఉంటే, మన దేశ అభివృద్ధిలో మనం గొప్ప పాత్ర పోషించగలుగుతాం.ప్రతి యువకుడు మరియు యువతి దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావం అనే మార్గంలో నడుస్తూ, ప్రపంచంలో మార్పు తీసుకురావాలి. యువత ఒక్కరి విజయమే కాకుండా, సమాజం మొత్తం అభివృద్ధికి కృషి చేయాలి.మన అందరం కలిసికట్టుగా జ్ఞానం, కృషి, సేవ అనే త్రివేణి సంగమంగా మారి, రాబోయే తరాలకు వెలుగైన భవిష్యత్తు సృష్టిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం యువ మిత్ర సేవా సమితి నాయకులు ఎలకంటి సుధీర్,ఉట్ల సురేష్ ,నాగేష్ లతోపాటు గ్రంధాలయ పాఠకులు పాల్గొన్నారు.





# అంగారక చతుర్థి పూజలందుకున్న మహాగణపతి

- **అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు**

**మంథని,ప్రజాస్వరం**

అంగారక చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టత సంతరించుకుంది. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత సంకటహర చతుర్థి వస్తుంది. ప్రతీ నెలలో బహుళపక్షంలో వచ్చే చతుర్దశి తిథి మంగళవారంతో కలిసి వస్తే దానిని అంగారక చతుర్థిగా పిలుస్తారు. అంగారక చతుర్థి ప్రత్యేకత ఏంటంటే సూర్యగ్రహణంతో సమానమైన శక్తి ఈ తిథికి ఉంటుందట. సూర్యగ్రహణం రోజు స్నానం, దానం, పితృ కార్యం చేస్తే ఎటువంటి ఫలితాలు కలుగుతాయో, అంగారక చతుర్దశి రోజు కూడా స్నానం, దానం చేస్తే అటువంటి ఫలితాలే కలుగుతాయట..దేవతలలో మొట్టమొదట పూజించబడే ఎంతో విశిష్టత కలిగిన శ్రీ విఘ్నేశ్వరున్ని పూజించడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోయి అంతా శుభం జరుగుతుందనే విశ్వాసంతో సంకష్టహర చతుర్థి దీక్షను స్వీకరిస్తారు. ఈ రోజున భక్తులు గణేశుడిని పూజించి, ఉపవాసం ఉంటారు. కొత్తగా సంకష్టహర చతుర్థి ఉపవాసాలు ఉండాలనుకునేవారు అంగారక చతుర్థి నుండి దీక్షను ప్రారంభిస్తారు. రాత్రి చంద్రుడిని చూసిన తర్వాత ఉపవాసం విరమిస్తారు. ఇది అడ్డంకులను తొలగించి మరియు జ్ఞానం, శ్రేయస్సు,అదృష్టానికి దేవుడైన గణేశుడికి అంకితం చేయబడిన పవిత్రమైన రోజని హిందూమత పండితులు చెబుతున్నారు.గణపతికి ఇష్టమైన వారం మంగళవారం అలాగే నవగ్రహాల్లోని కుజ గ్రహ దోషం పోవాలన్న మంగళవారం వచ్చే అంగారక చతుర్థి రోజున "ఓం గం గణపతియై నమః " వంటి మంత్రాలను జపిస్తూ దుర్వా గడ్డి, తాజా పువ్వులు, నెయ్యి దీపాలు, ధూపంతో స్మరిస్తూ విఘ్నేశ్వరున్ని దర్శించుకుంటే అన్ని సంకటాలు తొలగిపోతాయి.. అంగారక చతుర్థి నాడు వ్రతం ఆచరించడం వల్ల జాతకంలో కుజ దోష సమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా చేసే పనులలో సంకటాలు తొలగి విజయాలు చేకూరుతాయని శాస్త్రవచనం. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు.అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు. ఈ రోజున విఘ్నేశ్వరునికి ఇష్టమైన గరిక (దూర్వాలు) సమర్పించడం అలాగే 21 ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే విఘ్నేశ్వరునికి ప్రీతిపాత్రలవుతారు అని శాస్త్రాల్లో పేర్కొనబడింది. ఈ రోజున చంద్రోదయం అనంతరం భోజనం చేయడం ఈ దీక్షలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. ముఖ్యంగా అంగారక చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండాచుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అంగారక చతుర్థి ని పుష్కరించుకొని దేవాలయంలో గణపతి హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పల్లి రాము ఆలయానికి వచ్చిన భక్తులకు సంకల్పాలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆలయం లోని స్వామి వారిని అలంకరిస్తూ భక్తుల సౌకర్యార్థం అర్చకులు పల్లి సంజీవ్, పల్లి రాము సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు.




## తప్పుడు ఫిర్యాదులతో అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు

- **ఇష్టపూర్వకంగానే కూతురుకు భూమి అమ్మి, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్ చేశారు**

**మంథని, ప్రజాస్వరం**

మంథని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన శనిగల శ్రీనివాస్ తప్పుడు ఫిర్యాదు చేస్తూ రెవెన్యూ అధికారులను పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆయన తల్లి శనిగల సుశీల సోదరి రామిడి పద్మ పేర్కొన్నారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనిగల సుశీల మాట్లాడుతూ తన భర్త శనిగల గంగయ్య ఇష్టపూర్వకంగానే కూతురుకు రూ. 42 లక్షలకు భూమి అమ్మడం జరిగిందని దానిని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని దానిలో తాసిల్దార్ బండి ప్రకాష్ పాత్ర ఏమి లేదని ఆమె తెలిపారు. ఇప్పటికే నా భర్త పైన ఉన్న రెండు ఎకరాల భూమిని నా కొడుకు కోడలు పేరు పైకి మార్చుకున్నాడని వెంకటాపూర్ లో కట్టుకున్న ఇల్లును సైతం తన పేరు పైకి మార్చుకొని అమ్ముకున్నాడని ఆరోపించారు. తల్లిదండ్రులమైన మాకు మా కొడుకు శ్రీనివాస్ అన్నం పెట్టకపోవడం బాగోగులు చూసుకోక పోవడంతో గోదావరిఖని లోని మా కూతురు రామిడి పద్మ వద్ద ఆశ్రయం పొందుతుండగా అక్కడికి వచ్చి నా యొక్క బంగారం తాళిబొట్టు తీసుకెళ్లాడని, ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు అయిందన్నారు. గత నాలుగు నెలలక్రితం నా భర్తను ఇక్కడ నుండి తీసుకొని వెళ్లి ఆయనకు మాయమాటలు చెప్పి తప్పుడు ఫిర్యాదు చేపిస్తున్నాడని వాపోయారు, మా కుమారుడు శ్రీనివాస్ వెంకటాపూర్ గ్రామానికి చెందిన పల్లాకుల నరసింహారెడ్డి, తోకల రమేష్, గుజ్జుల సత్యనారాయణ రెడ్డి ల సహకారంతో తప్పుడు ఫిర్యాదు చేస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు

# దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్

- **ఖనిలో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు.**
- **విద్యార్థులకు అండ ఏఐఎస్ఎఫ్ జెండా.**
- **ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం.**

**గోదావరిఖని, ప్రజాస్వరం :**




అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని స్థానిక మార్కండేయ కాలనీలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్యఅతిథిగా హాజరై శ్వేత అరుణ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘమని,స్వాతంత్రం రాకపూర్వమే 1936ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని, లక్నోనగరంలోని బెనారస్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య పురుడోసుకున్నదాని,కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏదైనా ఉన్నదంటే అది ఒక్క ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘమే అని, నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ పాఠశాలలలో కళాశాలలలో మౌలిక సదుపాయాల కల్పించాలని, పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ,ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, మెస్ ,కాస్మోటిక్ చార్జీలను ధరలకు అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, విద్యాశాఖ మంత్రిని వెంటనే కేటాయించాలని, గురుకుల విద్యార్థులకు సొంత భవనాలను కేటాయించాలని అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులకు విద్యార్థి లోకం ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులను విజయవంతం చేయాలని,విద్యార్థులకు అండ,ఏఐఎస్ఎఫ్జెండా ఎల్లప్పుడూ ఉంటదని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి నితిలేష్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్, గొడిసెల ప్రణీత్, తడిగొప్పుల సాయి అనుప్, కట్ల అభినయ్, రౌతు విదిష తదితరులు పాల్గొన్నారు.



## క్విట్ ఇండియా అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- **రణరంగ చౌక్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళి అర్పించిన మంత్రి నాదెండ్ల మనోహర్**

**తెనాలి, ఆగస్టు 12, ప్రజాస్వరం**

క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారి స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల అన్నారు.తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో రణరంగ చౌక్‌లో క్విట్ ఇండియా అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి రణరంగ చౌక్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మాగాంధీ పిలుపు మేరకు 1942 ఆగస్టు 12న తెనాలిలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో ఏడుగురు ఉద్యమకారులు అమరులయ్యారని గుర్తుచేశారు. మాజేటి సుబ్బారావు, సిరిగిరి లింగం, భాస్కరుని లక్ష్మీనారాయణ, తమ్మినేని సుబ్బారెడ్డి, గాలి రామకోటయ్య, ప్రయోగ రాఘవయ్య, జాస్తి అప్పయ్య ఉన్నారు. స్వరాజ్యం కోసం రైతాంగం తమ ఆస్తులను త్యాగం చేశారని, మహిళలు తమ మెడలోని నగలను గాంధీజీకి అందజేసి దేశ సేవలో భాగమయ్యారన్నారు. క్విట్ ఇండియా ఘటన జరిగిన 17 సంవత్సరాల తర్వాత, అమరవీరుల జ్ఞాపకార్థం వారి ప్రాణాలు కోల్పోయిన చోటే ఏడు స్తూపాలు, ఒక విగ్రహాన్ని నిర్మించారు. ఆ ప్రదేశానికి రణరంగ చౌక్ అని పేరు పెట్టారు. ఈ సందర్భంగా రణరంగ చౌక్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం, తెనాలిలో వివిధ రంగాల్లో ప్రజాసేవలు అందిస్తున్న ప్రముఖులను మంత్రి ఘనంగా సన్మానించారు.



## పార్లమెంట్ ఆవరణలో ఎంపీల నిరసన

**న్యూఢిల్లీ,ప్రజాస్వరం**

బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ఎస్ఐఆర్, వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్, ఆర్జేడీ మంగళవారం కూడా నిరసనను కొనసాగించాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీతో సహా పలువురు ప్రతిపక్ష నేతలు మింతా దేవి, అనే బిహార్ ఓటరు ఫొటోతో ఉన్న టీ షర్టులు ధరించి పార్లమెంటు వెలుపల నిరసన చేపట్టారు. మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ఇతర ప్రతిపక్ష ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు.





## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు స్కూల్లు

- **మండల విద్యాధికారికి ఫిర్యాదు చేసిన కొలకాని రాజు...**

**జమ్మికుంట, ప్రజాస్వరం**

జమ్మికుంట పట్టణంలోని ఒక ప్రైవేట్ హైస్కూల్, లో టిసి కోసం రెండు వేల రూపాయలు డిమాండ్ చేయగా విద్యార్థి తండ్రి ఎడ్ల శ్రీనివాస్, నిరసన వ్యక్తం చేస్తూ విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేసింది కాకుండా టిసి కోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అదనంగా రెండు వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు, నేను నిరుపేద రైతును ఫీజు కట్టడానికి డబ్బులేక ప్రభుత్వ స్కూల్లో నా కుమారుడిని చేర్పించానని , రెండు నెలల నుంచి స్కూల్ యాజమాన్యం నన్ను ఇబ్బంది పెట్టగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, దృష్టికి తీసువెళ్ళానని, స్వయంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, స్కూల్ కి వచ్చి టిసి కి డబ్బులు ఎందుకు అనగా స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, రెండు వేల రూపాయలు కడితేనే టిసి ఇవ్వడం జరుగుతుందని, మాకు జిల్లా, మండల విద్యాశాఖాధికారులకు ఖర్చులు ఉంటాయని తెలిపారు, టిసి కి డబ్బులు కడుతాం దానికి రసీదు ఇవ్వమని అడుగగా అలా ఇవ్వమని తెలుపగా, మండల విద్యాధికారి హేమలతకు ఫోన్లో కొలకాని రాజు, సంప్రదించగా టిసి కి ఎలాంటి డబ్బులు కట్టాల్సిన అవసరం లేదని, మీరు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారని బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లగా సాయంత్రం వచ్చి టిసి తీసుకోవాలని బతిమాలడం ఏంటని ? ప్రశ్నించారు, ఈ సందర్భంగా కొలకాని రాజు, మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలోని ఇట్టి స్కూల్ పై మండల, జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేస్తామని, జమ్మికుంటలోని ఏ విద్యా సంస్థలైన టిసిల కోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అక్రమంగా డబ్బులు డిమాండ్ చేస్తే విద్యా సంస్థలను ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు, ఈకార్యక్రమంలో జిల్లా యువమోర్చ అధికార ప్రతినిధి కైలాసకొటి గణేష్, పట్టణ ఉపాధ్యక్షులు ఇటుకాల స్వరూప, రాకేష్ ఠాకూర్, మేడిపల్లి మహేష్, సిరియాల విజయ్, మ్యాదరి శంకర్, తదితరులు పాల్గొన్నారు

# న్యాయవాద దంపతుల హత్య కేసు సిబిఐకి బదిలీ

- **2021 ఫిబ్రవరి 17న మంథని పెద్దపల్లి రహదారిలో నడి రోడ్డుపై గట్టు వామన్ రావు, పివి నాగమణిల హత్య**
- **ఈ హత్య కేసు దర్యాప్తు పారదర్శకంగా జరగలేదని, సీబీఐకి అప్పగించాలని సుప్రీంకోర్టును గతంలో అభ్యర్థించిన గట్టు కిషన్ రావు**

**మంథని, ప్రజాస్వరం**





రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించిన హై కోర్టు న్యాయవాదులు గట్టు వామన్ రావు, పివి నాగమణి దంపతుల హత్య కేసు విచారణను సీబీఐకి బదిలీ చేస్తూ దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాలు జారీ చేసింది.. 2021 ఫిబ్రవరి 17న మంథని పెద్దపల్లి రహదారిలోని రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో వామన్ రావు, నాగమణిలు హత్యకు గురైన సంగతి తెలిసిందే. మంథని కోర్టులో కేసు విచారణ కోసం వెల్లివస్తుండగా వీరిద్దరూ హత్యకు గురి కాగా ఈ కేసులో పలువురిని అప్పుడు పోలీసులు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అడ్వకేట్ల మర్డర్ కేసు విషయంలో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశాయి. దీంతో అప్పటి ప్రభుత్వం ఐజీ నాగిరెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని ఆదేశించింది. రామగుండం కమిషనరేట్ పరిధిలో జరిగిన ఈ హత్య కేసులో కుట్ర కోణం దాగి ఉందని వామన్ రావు తండ్రి కిషన్ రావు పలు మార్లు ఆరోపించారు. అంతేకాకుండా వామన్ రావు, పివి నాగమణిల హత్య కేసు దర్యాప్తు పారదర్శకంగా జరగలేదని, సీబీఐకి కేసు విచారణ బాధ్యతలు అప్పగించాలని కోరుతూ సుప్రీంకోర్టును కూడా అభ్యర్థించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన కోర్టు తెలంగాణ ప్రభుత్వం నుండి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. వామన్ రావు, నాగమణిల హత్య కేసును సీబీఐకి అప్పగించడానికి తమకేమీ అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విన్నవించింది. మంగళవారం విచారించిన సుప్రీం కోర్టు ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలని ఆదేశించింది.

**మళ్లీ మొదటి నుండి...**

వామన్ రావు, పీవీ నాగమణీల హత్య కేసుపై సీబీఐ అధికారుల బృందం విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. 2021 ఫిబ్రవరి 17న జరిగిన పరిణామాలు, కేసులో అరెస్ట్ అయిన వారి ద్వారా దర్యాప్తు అధికారులు సేకరించిన వాంగ్మూలాలను క్షుణ్ణంగా స్టడీ చేయనుందని సమాచారం. మొదట రామగుండం కమిషనరేట్ పోలీసులు చేపట్టిన దర్యాప్తుపై సమగ్రంగా అధ్యయనం చేసిన తరువాత సీబీఐ అధికారులు ఓ నిర్ణయానికి రానున్నట్టుగా సమాచారం. వామన్ రావు,నాగమణిల హత్యకు గల కారణాలు నిందితులు చెప్తున్న విషయాలను పరిశీలించడంతో పాటు కుట్ర కోణం ఏమైనా దాగి ఉందా అన్న కోణంలోనూ సీబీఐ ఆరా తీయనుంది. ఈ కేసుతో సంబంధం ఉందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి కూడా నోటీసులు ఇచ్చి విచారణ చేయనున్నట్టుగా సమాచారం.